

మృత్యువాత పడిన పెలికాన్ పక్షులు

నేలపట్టు పక్షుల కేంద్రంలోని చుక్క నీరు లేని చెరువులు - ఎగురలేని స్థితిలో ఉన్న పక్షి



కొద్దిపాటి నీటితో ఉన్న మొదటి చెరువు



చెరువులోని కొద్దిపాటి నీటిలో సంచరిస్తున్న పక్షులు

నీరులేక.. మృత్యుకేక

- నేలపట్టు విడిది కేంద్రంలో మరణ మృదంగం
- కదలలేక చెట్లపైనే ప్రాణాలు విడుస్తున్న పెలికాన్
- 'దాహాకారాలతో' నేలరాలుతున్న విహంగాలు
- పరిరక్షించలేక చేతులెత్తేసిన అధికారులు



చెట్టు కొమ్మల మధ్యే మృత్యువాత

నాడు ఆహ్లాదం పంచిన ఆ కేంద్రం ఇప్పుడు ఆవేదన కలిగిస్తోంది. కిలకిలలకు బదులు పక్షులు విలవిలలాడుతుంటే హృదయం ద్రవించిపోతోంది. విహార విడిది కోసం ఖండాలు దాటి వచ్చిన అరుదైన విహంగాలకు ఆహారమూ కరువయ్యింది. జలకళతో కేరింతలు కొడుతూ కాలాన్ని మరిచిపోయిన గూడబాతు(పెలికాన్)లకు గుక్కెడు నీరే గగనమైంది. దొరవారిసత్రం మండలంలోని నేలపట్టు పక్షుల కేంద్రంలో ఇప్పుడు మూగ ప్రాణుల మరణ మృదంగం కలవరపెడుతోంది. కాసింత నీరూ అందించలేని కారుణ్య రహిత అధికార యంత్రాంగ తీరును ఇది ప్రతిబింబిస్తోంది.

ప్రకృతి ప్రేమికుల మనసును దోచుకునే నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంలో విదేశీ విహంగాల మృత్యు ఘోష విని పిస్తోంది. అడుగంటిన నీటి వనరుల్లో అల్లల్లాడుతున్న పక్షుల యాతన చూస్తే గుండె చెరువవుతోంది. దేశ విదేశాలను దాటి వచ్చే విహంగాల విడిదికి కేరాఫ్ అయిన నేలపట్టులో 'దాహాకారాల' తీరు దయనీయంగా మారింది. ఏటా అక్టోబరులో సుమారు 120 రకాలకు చెందిన వేల సంఖ్యలో పక్షులు ఇక్కడ విడిది చేస్తాయి. ఇక్కడున్న రెండు మంచి నీటి చెరువుల్లో చెట్లపై కొలువుదీరి ఆనందాన్ని పంచుతాయి. కేంద్రమంతా సందడిచేస్తాయి. తెల్లారగానే ఆహారం కోసం పరిసర పొలాల్లో, పులికాట్ సరస్సులో వాలిపోయి సాయంత్రం మళ్లీ నేలపట్టుకు చేరుకుంటాయి. ఏప్రిల్ మొదటి వారానికల్లా తిరిగి సొంతప్రాంతాలకు పయనమవుతాయి.

- దొరవారిసత్రం

చెట్లపై నిర్జీవంగా..

ప్రస్తుతం పక్షుల రక్షిత కేంద్రంలో నీటి వనరులు అడుగంటిపోయాయి. ఆహార వేటలో రెక్కలు అలసిపోయినా ఫలితం కనిపించడం లేదు. ఎండిన డొక్కలతో ఈసురోమంటూ పక్షులు గూడు చేరుకుంటున్నాయి. గొంతు తడుపుకొందామంటే కనుచూపుమేరలో చుక్కనీరు కనిపించడం లేదు. ఫలితంగా ఈ విదేశీ అతిథులు ఆకలితో అలమటిస్తున్నాయి. దుర్భరస్థితిలో కొన్ని మృత్యువాత పడుతున్నాయి. పదుల సంఖ్యలో పెలికాన్ పక్షులు ప్రాణం విడుస్తున్నాయి. చెట్లపై నిర్జీవంగా పడున్న కళేబరాలు కనిపిస్తున్నాయి.

ప్రత్యామ్నాయమున్నా పట్టించుకునే వారేరి..

కొన్ని పెలికాన్ పక్షులు వయో భారంతో తిరిగి తమ ఖండాలకు చేరుకోలేక నేలపట్టులోనే ఆగిపోతున్నాయి. ఇలాంటి పక్షుల ఆలనాపాలనా చూసేవారు కరువయ్యారు. చెరువుల్లో నీరు పూర్తిగా అడుగంటి పోతే పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రస్తుతం మొదటి చెరువు అడుగంటింది. ఉన్న కొద్దిపాటి బురద నీరు తాగుతున్న పక్షులు అనారోగ్యంతో మృత్యువాత పడుతున్నాయి. పది రోజుల్లోనే సుమారు 20 వరకు చనిపోయినట్లు అంచనా. ఈ కేంద్రంలో ఇప్పుడు 50 పెలికాన్ పక్షులు సంచరిస్తున్నాయి. వీటి ఆహారం, నీరు కోసం స్థానిక వన్యప్రాణి సంరక్షణ శాఖ అధికారులు ఎలాంటి ప్రయత్నాలు చేయడం లేదు. నీరసంతో సత్తువ కోల్పోయిన పక్షులను పట్టుకుని పులికాట్ సరస్సులో విడిచిపెడితే కనీసం ప్రాణలైనా నిలబడతాయి. అలాంటి ప్రయత్నమూ చేయకుండా అధికారులు చేతులెత్తేశారు. ఇదే నిర్లక్ష్యం కొనసాగితే మిగిలిన ప్రాణులు కూడా విగత జీవులయ్యే ప్రమాదం నెలకొంది.

మృత్యువు అంచున పెలికాన్

ఆస్ట్రేలియా, బర్మా, బంగ్లాదేశ, పాకిస్తాన్, శ్రీలంక వంటి దేశాల నుంచి పెలికాన్ పక్షులు ఇక్కడ విడిదికి విచ్చేస్తాయి. 28 ఏళ్ల జీవితకాలం ఉండే వీటి సగటు బరువు 4.54 నుంచి 7.7 కిలోల వరకు ఉంటుంది. సుదీర్ఘ ముక్కు, 152 నుంచి 188 సెం.మీ వరకు పొడవు రెక్కలు వీటి ప్రత్యేకత. అరుదైన ఈ జాతి పక్షుల్లో కొన్ని నేలపట్టుకు వచ్చాక వయోభారంతో తిరిగి ఖండాంతరాలు వెళ్లలేక ఇక్కడే ఉండిపోతున్నాయి. ఎటువంటి సంరక్షణ లేక ఇవి ఇక్కడే విషాదాంతమవుతున్నాయి.

ఆ హామీలు నీటిమూటేనా..

నేలపట్టు పక్షుల కేంద్రంలోని రెండు చెరువులను వేసవికి ముందు నీటితో నింపితే మండుటెండలోనూ ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. అధికారులు పట్టించుకోకపోవడంతో ఏటా మేలో మృత్యు ఘోష వినిపిస్తోంది. పక్షులు చనిపోవడం పరిపాటిగా మారింది. ఫ్లెమింగో వేడుక వేళ నాయకులు వస్తుంటారు. ఇక్కడి చెరువుల్లో ఎప్పుడూ జలకళ ఉండేలా చూస్తామంటూ హామీలిస్తున్నా నీటిమూటగానే మిగిలిపోతున్నాయి.

31మంది టీడీపీ నేతలకు బెయిల్ మంజూరు

- హత్యాయత్నం కేసులో ఊరట

తిరుపతి(నేరవిభాగం), జూన్ 2: తిరుపతిలోని పద్మావతి మహిళా వర్సిటీ, స్విమ్స్ ఆస్పత్రి వద్ద జరిగిన గొడవల్లో 37మంది టీడీపీ నేతలపై నమోదైన హత్యాయత్నం కేసులో 31 మందికి బెయిల్ మంజూరు చేస్తూ హైకోర్టు ఉత్తర్వులిచ్చింది. మిగిలినవారు విదేశాల్లో ఉండటంతో వీరు బెయిల్ పిటిషన్ వేయలేదు. వివరాలిలా.. పద్మావతి మహిళా వర్సిటీ, స్విమ్స్ ఆస్పత్రి వద్ద మే 14వ తేదీన టీడీపీ, వైసీపీ నాయకుల మధ్య గొడవలు, ఘర్షణలు, విధ్వంసాలు చోటు చేసుకున్నాయి. దీనిపై టీడీపీ నాయకులు కొందరు తమపై దాడి చేసి, హత్యాయత్నానికి పాల్పడ్డారంటూ గత నెల 26వ తేదీన తిరుపతి శివారు ప్రాంతమైన తిరుమలనగర్‌కు చెందిన వైసీపీ కార్యకర్త ఎ.రాజీవ్ ఎస్వీయూనివర్సిటీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటన జరిగిన 12 రోజుల తర్వాత ఫిర్యాదు చేస్తే.. పోలీసులు కనీసం విచారించకుండా తమపై అన్యాయంగా హత్యాయత్నం కేసు నమోదు చేశారని బెయిల్ పిటిషన్‌లో టీడీపీ నాయకులు పేర్కొన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాత 31మందికి షరతులతో కూడిన బెయిల్‌ని హైకోర్టు మంజూరు చేసింది. 'బెయిల్ మంజూరైన వారంతా ఈనెల 7వ తేదీ వరకు చంద్రగిరి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో తిరగకూడదు. కౌంటింగ్ ప్రక్రియలో ఏజెంట్లుగా ఉండకూడదు. ఈనెల 13వ తేదీ వరకు ప్రతి మూడ్రోజులకోసారి రేణిగుంట పోలీసు స్టేషన్‌లో హాజరై, సంతకాలు చేయాలి' అని హైకోర్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. తదుపరి కేసు విచారణను ఈ నెల 13వ తేదీకి వాయిదా వేసింది.

పిడుగుల బీభత్సం

- పుత్తూరులో 5 ఆవులు మృతి
- ఈదురుగాలులతో విద్యుత్‌శాఖకు నష్టం

తిరుపతి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలుచోట్ల పిడుగులు బీభత్సం సృష్టించాయి. ఆదివారం ఉదయం పిడుగుపాటుకు పుత్తూరు మండలంలో ఐదు ఆవులు మృతి చెందాయి. శనివారం రాత్రి కేవీబీపురంలో వాటర్ ట్యాంక్‌పై పిడుగుపడడంతో ధ్వంసమైంది. పలు మండలాల్లో ఈదురుగాలులు కారణంగా విద్యుత్‌శాఖకు నష్టం వాటిల్లింది. పిచ్చాటూరు మండలంలో ఉరుములు, మెరుపులు భయపెట్టాయి. వెంకటగిరిలో ఆదివారం మధ్యాహ్నం తేలికపాటి చిరుజల్లులతో వాతావరణం చల్లబడింది.

నష్టపరిహారం ఇప్పించండి

పుత్తూరు: మండలంలోని పరమేశ్వరం మంగళం పంచాయతీలోని జయరాణీపురం గ్రామ పొలిమేరలో ఓ చెట్టుకింద ఆవులు గడ్డి మేస్తుండగా పెద్ద శబ్దంతో ఆదివారం ఉదయం పిడుగు పడింది. దీంతో ఐదు ఆవులు షాక్‌కు గురై కుప్పకూలిపోయి మృతి చెందాయి.తనకు నష్టపరిహారం ఇప్పించాలని వాటి యజమాని శ్యామల.. ప్రభుత్వాన్ని వేడుకున్నారు.



జయరాణీపురంలో మృతి చెందిన ఆవులు

కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు

పాకాల: ఆదివారం సాయంత్రం వీచిన బలమైన ఈదురు గాలులను బండపాకాల సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నేలకొరిగింది. గాదంకి, నేంద్రగుంట, కె.వడ్డేపల్లె పరిసరాల్లో ఉరుములు, మెరుపులతో నాలుగు 25 కేవీ, మూడు 16 కేవీ, మూడు సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. రూ.10లక్షల మేర నష్టం వాటిల్లింది. మరమ్మతులు చేసి త్వరగా విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తామని తిరుపతి రూరల్ ఈఈ వాసు రెడ్డి, డీఈఈ నరేంద్ర తెలిపారు. మామిడి తోటల్లో అంతంత మాత్రమే కాసిన కాయలు రాలిపోవడంతో రైతులు నష్టపోయారు.



బండపాకాల సమీపంలో నేలకూలిన ట్రాన్స్‌ఫార్మర్

రైల్వే ట్రాక్‌పై విరిగిపడిన చెట్టుకొమ్మలు

పాకాల-తిరుపతి రైల్వే మార్గంలో గాదంకి సమీపాన ఆదివారం సాయంత్రం రైల్వే ట్రాక్‌పై గాలివానకు చెట్టు కొమ్మలు విరిగి పడ్డాయి. ఈ సమయంలో తిరుపతి నుంచి బెంగళూరు వెళ్తున్న ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ పరిస్థితి గమనించి.. రైలు నిలిపివేయడంతో ప్రమాదం తప్పింది. రైల్వేసిబ్బంది చెట్టుకొమ్మలు తొలగించడంతో అరగంట ఆలస్యంగా వెళ్లింది.



ఆగిన రైలు

చిట్టత్తూరు, కాలేపల్లెలో భారీ వర్షం

రామచంద్రాపురం: చిట్టత్తూరు, కాలేపల్లె వద్ద ఆదివారం మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో భారీ వర్షం కురిసింది. చిన్నపాటి కుంటలు నిండగా, కాలువలు ప్రవహించాయి. అక్కడక్కడా కోతకు వచ్చిన వరి నేలకొరిగింది. రాయలచెరువుకట్ట కింద ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు తప్ప వర్షం కురవలేదు.



చిట్టత్తూరులో కురుస్తున్న వాన

గంధమనేని శివయ్య సతీమణి మృతి

పిచ్చాటూరు, జూన్ 2: పుత్తూరు మాజీ ఎమ్మెల్యే దివంగత గంధమనేని శివయ్య సతీమణి పారిజాతమ్మ(84) ఆదివారం సాయంత్రం మృతి చెందారు. పిచ్చాటూరు మండలం గోవర్ధనగిరి గ్రామానికి చెందిన గంధమనేని శివయ్య సీపీఐకి 1970వ దశకంలో కీలక నేతగా వ్యవహరించారు. 1972-77 మధ్యకాలంలో ఈయన పుత్తూరు ఎమ్మెల్యేగా పనిచేశారు. శివయ్య సతీమణి పారిజాతమ్మ వృద్ధాప్య రీత్యా ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు చెన్నైలో కన్ను మూసినట్లు కుమారుడు గంధమనేని గౌతమ్ వెల్లడించారు. అంత్యక్రియలు సోమవారం సాయంత్రం చెన్నై కోడంబాక్కం ఎన్టీఆర్ స్ట్రీట్‌లోని స్వగృహంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.



పారిజాతమ్మ (ఫైల్ ఫొటో)

చంద్రగిరి భద్రతపై ప్రత్యేక దృష్టి

- ప్రతి రెండు గ్రామాలకో సాయుధ బలగంతో కూడిన పెట్రోలింగ్ పార్టీ
- అదనంగా రెండు గ్రేహౌండ్స్ పార్టీలు
- ఈవీఎంల భద్రతకు ఢోకా లేదు
- ఇప్పటికే అదుపులో 200 మంది కీలక ట్రబుల్ మాంగర్స్
- ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 2: పద్మావతి మహిళా వర్సిటీ స్ట్రాంగ్ రూమ్‌లోని పోల్డ్ ఈవీఎంల భద్రతకు ఎలాంటి ఢోకా లేదని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు చెప్పారు. ఆదివారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ప్రధానంగా కౌంటింగ్ కేంద్రం వద్ద అల్లర్లు, గొడవలు జరగకుండా ఉండటానికి పటిష్ఠ చర్యలు తీసుకున్నామని చెప్పారు. జిల్లా ప్రజలు చాలా మంచి వారన్నారు. అటువంటి వారిని కొందరు నాయకులు, వారి అనుచరులు రెచ్చగొట్టి గొడవలకు ప్రేరేపిస్తే మాత్రం ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఇప్పటికే కౌంటింగ్ ప్రక్రియకు ఇబ్బందులు సృష్టిస్తారని భావించిన దాదాపు 200 మంది కీలక వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామన్నారు. ఇక చంద్రగిరి నియోజకవర్గంలో భద్రతపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. ఇక్కడ ఓ అదనపు ఎస్పీ పర్యవేక్షణలో ఇద్దరు డీఎస్పీలు, నలుగురు సీఐలు, ఆరుగురు ఎస్ఐలు, 200 మంది బలగాలను నియమించామన్నారు. వీరు కాకుండా రెండు గ్రేహౌండ్స్ పార్టీలను కేటాయించామన్నారు. వీరివద్ద లాఠీలతో పాటు తుపాకులూ ఉంటాయన్నారు. అలాగే ప్రతి రెండు గ్రామాలకో సాయుధ బలగంతో కూడిన పెట్రోలింగ్ పార్టీని ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఎక్కడ అల్లర్లు జరిగినా 10 నిమిషాల వ్యవధిలోనే సంబంధిత ప్రాంతాలకు చేరుకునేలా బలగాలను సిద్ధం చేసినట్లు తెలిపారు.

శ్రుతి మించితే లాఠీలకు పని చెప్పండి

కౌంటింగ్‌కు ఇబ్బందులు కల్గించేలా వ్యవహరిస్తూ.. శ్రుతిమించే పరిస్థితులొస్తే మాత్రం లాఠీలకు పనిచెప్పాలని సిబ్బందిని ఎస్పీ ఆదేశించారు. ఆదివారం మహిళా వర్సిటీలో పోలీసు అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేశాకే నిర్దేశిత గేట్ల ద్వారా కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతించాలన్నారు. మీడియా పాయింట్ వరకు కెమెరాలు, మొబైల్ ఫోన్లను అనుమతించాలన్నారు. స్ట్రాంగ్ రూమ్ వెనుక తుమ్మలగుంట రోడ్డు వైపు ఉన్న పార్టీలు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా పరువు పోకుండా ప్రజా ప్రతినిధులు సహకరిస్తారనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో స్పెషల్ అధికారి సరిత, అదనపు ఎస్పీలు కులశేఖర్, విమలకుమారి, వెంకట్రావు, సాయుధ దళం అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.



అబ్జర్వర్‌కు వివరాలు తెలియజేస్తున్న ఎస్పీ, కలెక్టర్

స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన అబ్జర్వర్

తిరుపతి(నేరవిభాగం/కలెక్టరేట్), జూన్ 2: తిరుపతిలో కౌంటింగ్ పరిశీలన కోసం నియమితులైన స్పెషల్ పోలీసు అబ్జర్వర్ దీపక్ మిశ్రాకు ఆదివారం ఎస్పీ హర్షవర్ధన్‌రాజు స్వాగతం పలికారు. అనంతరం ఆయన పద్మావతి మహిళా వర్సిటీలోని స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల వద్దకు చేరుకున్నారు. అనంతరం కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి ఏర్పాట్లను అబ్జర్వర్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ, కలెక్టర్‌కు ఆయన పలు సూచనలిచ్చారు.

రేపు నిమ్మ మార్కెట్‌కు సెలవు

గూడూరు అర్బన్, జూన్ 2: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కౌంటింగ్ జరగనుండడంతో గూడూరు నిమ్మ మార్కెట్‌కు అసోసియేషన్ సభ్యులు మంగళవారం సెలవు ప్రకటించారు. ప్రతి బుధవారం నిమ్మ మార్కెట్‌కు సెలవు ఉంటుంది. అయితే కౌంటింగ్‌ను వీక్షించేందుకు నిమ్మకాయలు లోడింగ్ చేసే కార్మికులు సెలవు కోరడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో మంగళ, బుధవారాల్లో మార్కెట్‌కు సెలవు ఉంటుంది. రైతులు, ఆటో కార్మికులు గమనించాలని, సోమవారం నుంచి నిమ్మ రైతులు కోతలకు విరామం ప్రకటించాలని వ్యాపారులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.





అబ్బురపరచిన చిన్నారుల నృత్య ప్రదర్శన

తిరుచానూరు, జూన్ 2: తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో సమ్మర్ క్యాంపులో భాగంగా నెలరోజుల పాటు వివిధ కళల్లో శిక్షణ పొందిన చిన్నారులు ఆదివారం ప్రదర్శించిన నృత్యప్రదర్శన అబ్బుర పరచింది. శిల్పారామం ఏవో ఖాదరవల్లి చిన్నారులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

టీడీపీ నాయకుడు సత్యనారాయణరెడ్డికి నివాళులు



సత్యనారాయణరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పులివర్తి సుధారెడ్డి

చంద్రగిరి, జూన్ 2: ప్రజల మనస్సుల్లో శాశ్వతంగా నిలిచిన వ్యక్తి టీడీపీ నాయకుడు సత్యనారాయణరెడ్డి అని టీడీపీ నాయకురాలు పులివర్తి సుధారెడ్డి అన్నారు. తొండవాడలో ఆదివారం మాజీ సర్పంచ్ సత్యనారాయణ రెడ్డి వర్థంతి కార్యక్రమంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. తొండవాడ పంచాయతీ అభివృద్ధికి ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. టీడీపీ నాయకులు పులికంటి మోహన్‌రెడ్డి, జగన్మోహన్‌నాయుడు, మణి యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



చిన్నగొట్టిగల్లులో భగవద్గీత ప్రచారం చేస్తున్న కమిటీ సభ్యులు

భాకరాపేట, జూన్ 2: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో చిన్నగొట్టిగల్లు మండలంలోని రాజువారి పల్లె, తిప్పరెడ్డిగారిపల్లె, ఎడంవారిపల్లె, నెల్లుట్లవారి పల్లె, కొత్తపల్లె, చిన్నగొట్టిగల్లు, టంగుటూరు వానపల్లి, గ్రామాలలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారాన్ని నిర్వహించారు. జీవాత్మ, ఆత్మ, పరమాత్మలు ఆధ్యాత్మికంలో ముఖ్యమైనవని సభ్యులు పేర్కొన్నారు. వీటి ఆధారంగానే త్రైత సిద్ధాంత భగవద్గీతను రచించారన్నారు. వీటి ఆరాధనతో ధర్మ సంస్థాపన జరుగుతుందన్నారు. కమిటీ సభ్యులు నరసిహులు, మహేంద్ర మధు, మల్లేశ్వరి, మధుప్రియ, రమ్యశ్రీ, వెంకటసుబ్బమ్మ, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

చివరి ఓటు వరకూ అప్రమత్తం

● కౌంటింగ్ ఏజెంట్ల శిక్షణలో పులివర్తి సుధారెడ్డి



కౌంటింగ్ ఏజెంట్ల శిక్షణా కార్యక్రమంలో సుధారెడ్డి

తిరుచానూరు, జూన్ 2: ఎన్నికల్లో ఓడిపోతారని సర్వేలు తేల్చి చెప్పిన నేపథ్యంలో ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద వైసీపీ నాయకులు, కార్యకర్తలు అవకతవకలకు పాల్పడే అవకాశం ఉందని చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సతీమణి సుధారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రేణిగుంటలోని షై-కన్వెన్షన్ హాలులో పోస్టల్ బ్యాలెట్ల కౌంటింగ్‌పై నిర్వహించిన ఏజెంట్ల శిక్షణా కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. కౌంటింగ్ ఏజెంట్లు ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా పార్టీ భారీ మూల్యం చెల్లించుకోల్సి వస్తుందన్నారు. అనుక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. చివరి ఓటు లెక్కించేంత వరకు ఏ ఒక్కరూ లెక్కింపు కేంద్రం నుంచి బయటకు రాకూడదన్నారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా కౌంటింగ్ కేంద్రాల వద్ద అవాంఛనీయ పరిస్థితులు ఏర్పడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు.

వడదెబ్బకు వృద్ధుడి మృతి



మునికృష్ణమనాయుడు (ఫైల్ ఫొటో)

చంద్రగిరి, జూన్ 2: వడదెబ్బకు గురై ఓ వృద్ధుడు మృతి చెందాడు. చంద్రగిరి మండలం కొటాల గ్రామానికి చెందిన మునికృష్ణమనాయుడు(64) మూడు రోజులుగా ఎండ తీవ్రతకు తట్టుకోలేక తీవ్ర అస్వస్థతకు గురై శనివారం రాత్రి మృతి చెందాడని కుటుంబీకులు తెలిపారు.

ఇద్దరు వ్యక్తుల దుర్మరణం

● స్కూటర్‌ని ఢీకొన్న గుర్తు తెలియని వాహనం



రోడ్డుపై పడివున్న మృతదేహాలు

చంద్రగిరి, జూన్ 2: చంద్రగిరి మండలం, కోదండరామాపురం వద్ద పూతలపట్టు, నాయుడుపేట జాతీయ రహదారిలో ఆదివారం రాత్రి స్కూటర్‌ని గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో ఇద్దరు అక్కడిక్కడే మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు తిరుపతి రూరల్ మండలం పేరూరు పంచాయతీ ఎస్టీఆర్ కాలనీకి చెందిన అమ్ములు(38), ఎస్వీ నగర్‌కు చెందిన విశ్వం(28) తిరుపతి వ్యవసాయ కళాశాలలోని మెస్‌లో కార్మికులుగా పనిచేస్తున్నారు. సొంత పనుల నిమిత్తం చిత్తూరుకు స్కూటర్‌పై వెళ్ళి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో కోదండరామాపురం వద్దకు రాగానే గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈప్రమాదంలో అమ్ములు, విశ్వం తీవ్ర గాయాలతో అక్కడిక్కడే మృతి చెందారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హింసాత్మక ఘటనలకు తావు ఉండరాదు

● ట్రైనింగ్ ఎస్పీ దేవరాజ్ మనీష్ పటేల్

రామచంద్రాపురం, జూన్ 2: కౌంటింగ్ నేపథ్యంలో హింసాత్మకఘటనలకు తావు ఉండరాదని ట్రైనింగ్ ఎస్పీ దేవరాజు మనీష్ పటేల్ అన్నారు. ఆదివారం మండలంలోని కుప్పంబాదురు పరమాల గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 144 సెక్షన్, 30 యాక్ట్ అమల్లో ఉందన్నారు. ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎట్టి పరిస్థితుల్లో హింసను ఉపేక్షించేది లేదన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించమే ప్రధాన లక్ష్యమన్నారు. ఓట్ల లెక్కింపు వేళ విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించరాదన్నారు. బాణసంచా కాల్చడం నిషేధమన్నారు. గ్రామస్థులకు పోలీసుల నిబంధనలపై అవగాహన నిర్వహించారు. రాజకీయాలకు అతీతంగా ఐకమత్యంగా ఉండాలన్నారు. చంద్రగిరి ఇన్‌ఛార్జి డీఎస్పీ రవికుమార్, ఎస్ఐ చిరంజీవి, కేంద్రబలగాలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కుప్పంబాదూరులో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు →



పార్టీ కార్యాలయాల వద్ద పోలీస్ బందోబస్తు



చంద్రగిరిలో టీడీపీ కార్యాలయం వద్ద పోలీస్ బందోబస్తు ఉన్న దృశం

చంద్రగిరి, జూన్ 2: చంద్రగిరి మండలంలో సార్వత్రిక ఎన్నికల రోజున జరిగిన సంఘటనలు దృష్టిలో ఉంచుకుని, జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు చంద్రగిరిలో టీడీపీ, వైసీపీ కార్యాలయాలు వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. మంగళవారం ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో చంద్రగిరిలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్టు సీఐ రామయ్య తెలిపారు. బందోబస్తు బుధవారం వరకు ఉంటుందన్నారు.

అల్లర్లు సృష్టిస్తే కేసులు నమోదు చేస్తాం



చిన్నరామాపురంలో గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ రామయ్య

చంద్రగిరి, జూన్ 2: ఎన్నికల కౌంటింగ్ అనంతరం గ్రామాల్లో అల్లర్లు చేస్తే కేసులు నమోదు చేస్తామని సీఐ రామయ్య హెచ్చరించారు. చంద్రగిరి మండలంలోని ఎ.రంగంపేట, చిన్నరామాపురం గ్రామస్తులకు పోలీసులు ఆదివారం అవగాహన కల్పించారు. ఎన్నికల కౌంటింగ్ అనంతరం ఎవరైనా గొడలు చేసినా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా చట్టపరమైన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎస్ఐలు అనిత, రవీంద్రనాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

ఒక్కరోజు ఓపిక పట్టు!

కుప్పంలో పెరుగుతున్న 'కౌంటింగ్' వేడి



కుప్పం టీడీపీ కార్యాలయం ఎదుట పోలీసు నిఘా

కుప్పం, జూన్ 2: రాష్ట్రంలోనే కీలక నియోజకవర్గమైన కుప్పంలో కౌంటింగ్ వేడి అమాంతం పెరిగిపోయింది. మధ్యలో ఒక్కరోజు మాత్రమే మిగిలి ఉన్న సమయంలో వర్గాలుగా విడిపోయిన వ్యక్తులు విధ్వంస లక్ష్యాలను కూడా విధించుకుంటున్నారన్న ప్రచారం వారం పదిరోజులుగా చక్కర్లు కొడుతోంది. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పోటీ చేస్తున్న కుప్పంపైనే తొలి నుంచీ అందరి దృష్టీ కేంద్రీకృతమైంది. ఇక్కడ ఆయనను ఓడించే అంత సీను ఉన్నదో లేదో కానీ, మెజారిటీ గణనీయంగా తగ్గించడానికి మాత్రం సాక్షాత్తు మంత్రి పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికలకు ముందు సామదాన భేద దండోపాలన్నీ ప్రయోగించేశారు. వైసీపీ నుంచి చంద్రబాబుకు పోటీగా భరత్ బరిలో ఉన్నారు. ఎగ్జిట్ పోల్స్ వెలువడిన నేపథ్యంలో ఫలితాల గురించి చర్చోపచర్చలు అధికమైపోయాయి. చంద్రబాబుకు 60-70 వేల మెజారిటీ వస్తుందని, లేదు.. 25 వేల మెజారిటీతో భరత్ గెలిచిపోతున్నాడని బెట్టింగ్‌లు ప్రస్తుతం రన్నింగ్‌లో ఉన్నాయి. ఇప్పుడిలా బెట్టింగ్‌లు పెట్టిన వారితోపాటు, ఆయా రాజకీయ పార్టీల వ్యక్తులు కూడా రెచ్చిపోవడం ప్రారంభిస్తున్నారు. దాదాపు బహిరంగంగానే చర్చలకు తెర తీస్తున్నారు. ఫలితాల విడుదలకు ఒక్క రోజు మాత్రమే మిగిలిన క్రమంలో కుప్పంలో ఉద్రిక్తత తార స్థాయికి చేరుకుంటోంది.

> 'అదే చెబుతున్నాం, ఒకరోజు ఓపిక పట్టు అని.' 'వెయిట్ చేస్తే తెలుస్తుంది, ఏముంటుంది రా అని.'
> .. ఒక వాట్సాప్ గ్రూపులో జరిగిన వాదోపవాదాలలో ఇది శాంపుల్ మాత్రమే. ఈ గ్రూపులో ఇంతకన్నా తీవ్రమైన వ్యాఖ్యలున్నాయి.

> 'ఆ పార్టీ గెలిస్తే వారిపైన దాడి చేస్తారంట కదా, నిజమేనా?' 'నిజమేనంట. ఈ పార్టీ వోల్లు కూడా తాము గెలిస్తే ఆ రెండింటినీ వదిలే ప్రసక్తే లేదని ఒట్టు పెట్టుకుంటా వుండారంట.'
> - కుప్పంలో ఏ ఇద్దరు వ్యక్తులు కలిసినా జరుగుతున్న సంభాషణ ఇది.

హాస్పిటల్స్ టార్గెట్?

ఏ రాజకీయ పార్టీ అయిన గెలుపోటములు సహజం. కానీ కుప్పంలో దీన్ని అంగీకరించే పరిస్థితుల్లో ఆయా పార్టీ వర్గాలు ఉన్నట్లు కనిపించడంలేదు. కొద్దిరోజులుగా గ్రామాలలో పెరుగుతున్న ఉద్రిక్తతలే దీనికి నిదర్శనం. కుప్పం మండలం ఎన్.కొత్తపల్లెలో కేవలం తాగునీటి సరఫరా బకాయి అడిగినందుకు వైసీపీ కార్యకర్త ఒకరు, టీడీపీ కార్యకర్తలైన జయశంకర్, రెడ్డిపై దాడిచేసి తీవ్రంగా కొట్టిన సంఘటన తాజాగా చోటు చేసుకుంది. కేవలం నెల్లాళ్ల వ్యవధిలో నియోజకవర్గ వ్యాప్తంగా ఇటువంటి సంఘటనలు ఆరేడు జరిగాయి. పోలీసులు కేసులు కూడా నమోదు చేశారు. ఈసారి కుప్పం పట్టణంలోని మూడు హాస్పిటల్స్‌ను కొందరు టార్గెట్ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఇందులో వైసీపీకి చెందిన ప్రజాప్రతినిధి... టీడీపీకి నాయకుడిది మరొకటి.. మూడవది టీడీపీ నాయకుడి సంతానం నిర్వహణలో ఉన్న హాస్పిటల్. ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఏ హాస్పిటల్స్ టార్గెట్ అవుతాయో సులువుగా అర్థమవుతుంది. ఈ చర్చ వారం రోజులనుంచి పట్టణంలో విస్తృతంగా జరుగుతోంది. ఈ ప్రచారానికి భయపడిపోయిన ఆయా యాజమాన్యాలు తమ హాస్పిటల్స్ వద్ద సీసీ కెమెరాల సంఖ్య పెంచుకుంటున్నారు. ప్రైవేటు సైన్యాన్ని కూడా నియమించుకుంటున్నట్లు తెలిసింది. కేవలం హాస్పిటల్స్ మాత్రమే కాకుండా ఇతర ఆస్తుల మీద కూడా ఇప్పటికే కొందరి దృష్టి పడిందన్న ప్రచారం జోరుగా సాగుతోంది.

గ్రామాలలో పెరుగుతున్న ఉద్రిక్తత

కుప్పంలో గొడవలకు పేరుపడ్డ ప్రాంతాలైన కొత్తపేట, పాతపేట, బాబునగర్ వంటి చోట్ల ఇప్పటికే పోలీసులు తగు నిఘా ఏర్పాటు చేశారు. టీడీపీ, వైసీపీ కార్యాలయాలు, ఎమ్మెల్సీ భరత్ నివాసం, ముఖ్య ప్రాంతాలలోనూ బందోబస్తు ఉంచారు. గ్రామాలమీద పోలీసులు ఇంకా తగినంత ఫోకస్ పెట్టినట్లు కనిపించడంలేదు. అందుకనే గ్రామస్థాయిలో దాడులు జరుగుతూ ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. మున్సిపాలిటీ పరిధిలో ఎక్కువగా ఉద్యోగస్తులు, వ్యాపారస్తులు నివశిస్తుంటారు. పార్టీలు ఏవైనా సరే, వీరిమధ్య చాలా వరకు పరస్పర అవగాహన, కలిసిమెలిసి పనిచేసే తత్వం ఉంటుంది. కానీ పల్లెల్లో ఈ గుణం చాలా తక్కువ. స్థానిక సంస్థల ఎన్నికలప్పుడు ఏర్పడ్డ ఘర్షణ జ్వాలలు ఇంకా రగులుతూనే ఉన్నాయి. అంతేకాక పోలింగ్ సమయంలోనూ ఇరు పార్టీ శ్రేణుల మధ్య పెద్ద గొడవలు జరుగకపోయినా, చాలాచోట్ల ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి. కాబట్టి ఫలితాల సమయంలోనూ, తర్వాత కూడా గ్రామాలలో గొడవలు చోటు చేసుకునే ప్రమాదం అధికంగా ఉంటుంది. పోలీసులు అటువైపు కూడా దృష్టి సారించాల్సిన అవసరం ఉందని రాజకీయ విశ్లేషకులు సూచిస్తున్నారు.

12న కుప్పం రెడ్డెమ్మ సాహితీ అవార్డుల ప్రదానం

చిత్తూరు కల్చరల్, జూన్ 2: చిత్తూరులోని రాజామహల్ హోటల్‌లో ఈ నెల 12న ఉదయం 11 గంటలకు కుప్పం రెడ్డెమ్మ సాహితీ అవార్డులను పంపిణీ చేయనున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ కె. రామలక్ష్మి ఆదివారం తెలిపారు. కుప్పం రెడ్డెమ్మ జాతీయ స్థాయి నవల, కథానికల పోటీలకు 2023వ సంవత్సరంలో వివిధ మాధ్యమాల్లో ప్రచురితమై మన్ననలు పొందిన రచనలకు బహుమతులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వీటిలో.. నవలల విభాగంలో కె.ఎ.మునిసురేష్‌పిళ్లై రచించిన పుత్రిక శత్రు, సి.కాశిపురం ప్రభాకర్‌రెడ్డి రచించిన మేడం ఎంపికయ్యాయని సంస్థ అధ్యక్షురాలు డా.పి.రోజాప్రియ పేర్కొన్నారు. కథానికల పోటీలలో రోహిణి పంజారి రచించిన నల్లసూరీడు, డాక్టర్ ఎం.సుగుణరావు రచించిన సుగణకథాభిరామం ఎంపికైనట్లు సంస్థ కార్యదర్శి డా.సి. నిరంజన్‌రెడ్డి తెలిపారు.

గూడ్స్ ఢీకొని సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి



కుప్పం, జూన్ 2: కుప్పం రైల్వే స్టేషన్ ఎదురుగా ఆదివారం రాత్రి గూడ్స్ రైలు ఢీకొని యువకుడు మృతి చెందాడు. రైల్వే టికెట్ కోసం పట్టాలు దాటుతుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకున్నట్లు చూసినవారు చెబుతున్నారు. మృతదేహం వద్ద లభించిన గుర్తింపు కార్డును బట్టి, మృతుడిని రామకుప్పం మండలం బగలనత్తం గ్రామవాసి శశికుమార్‌గా గుర్తించారు. ఇతడు బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ రెండురోజుల క్రితం సొంత గ్రామానికి వచ్చారు. తిరిగి బెంగళూరు వెళ్లడానికి ఆదివారం రాత్రి కుప్పం రైల్వేస్టేషన్ చేరుకుని, కౌంటర్లో టికెట్ తీసుకున్నారు. ఇంతలో రైలు రావడం గమనించి, పట్టాలమీదుగా ఒకటో ప్లాటు ఫామ్ నుంచి రెండవ ప్లాట్‌ఫామ్‌కు పట్టాల మీదుగా వెళ్లడానికి ప్రయత్నించారు. అదే సమయంలో వేగంగా వస్తున్న గూడ్స్ రైలు ఢీకొనడంతో శశికుమార్ అక్కడికక్కడే మృతి చెందారు.

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ



రాహుకేతు మండపం వద్ద భక్తులు

శ్రీకాళహస్తి, జూన్ 2: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వేసవి, వారాంతపు సెలవులు కావడంతో తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సుమారు 30వేల మంది భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.200 శీఘ్ర దర్శన టిక్కెట్ల ద్వారా 1,610మంది, రూ.50 టిక్కెట్ల ద్వారా 2,830మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 టిక్కెట్ల ద్వారా 2,962మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,089, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 272మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 251మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 66మంది భక్తులు పూజలు రాహుకేతు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 17,319 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

ఆగని గజదాడులు

● పంటలపై స్వైరవిహారం ● పొలాల వద్ద రైతుల కాపలా



పేటూరు వద్ద మామిడి తోటలో కొమ్మలను విరిచేసిన ఏనుగులు

సోమల, జూన్ 2: సోమల మండలంలో ఏనుగులు దాడులు ఆగడం లేదు. దీంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. శనివారం రాత్రి పేటూరు పంచాయతీలో సంచరించిన ఏనుగులు మామిడి తోటల్లో కోతకు సిద్ధంగా ఉన్న కాయలను తిన్నంత తిని తొక్కేశాయి. చెట్లను వేళ్లతో పెకలించాయి. తోటల్లోని బోరు పైపులు, డ్రిప్ పరికరాలను ధ్వంసం చేశాయి. పేటూరు చెందిన చిట్టి, విష్ణు, ప్రసాద్, సుబ్రమణ్యం, చంద్ర తదితరుల టమోటా, మామిడి పంటలలో విధ్వంసం సృష్టించాయి. ఇరికిపెంట పంచాయతీ, నంజంపేట పంచాయతీల్లో మరో ఏనుగుల మంద తోటలో కోతకు సిద్ధంగా ఉన్న మల్లికా రకం, బేనిషా మామిడి పండ్లను తిన్నంతా తిని కొమ్మలను ధ్వంసం చేసి, డ్రిప్ పరికరాలను తొక్కి నాశనం చేశాయి. నరస్వతీపురానికి చెందిన చిన్నయ్య టమోటాలను కోత కోసి ఆదివారం మార్కెట్‌కు తరలించేందుకు పొలం వద్దనే టమోటా బాక్సులను నిల్వ చేశాడు. జంట ఏనుగులు ఆమార్గంలో వచ్చి టమోటాను ధ్వంసం చేసి వెళ్లాయి. ఆ సమీపంలోనే వరి పొలంలో సంచరించి నష్ట పరిచాయి. నెల రోజులుగా పులిచెర్ల, సదుం మండలాల వైపు వెళ్లిన ఏనుగులు మళ్లీ మామిడి కోతల సమయంలో మండలంలో ప్రవేశించడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఆవులపల్లె, పెద్దఉప్పరపల్లె, పేటూరు, అన్నెమ్మగారిపల్లె పంచాయతీల్లో అధికంగా బేనిషా, మల్లిక రకం, నీలం రకం మామిడి కోతలు చేయాల్సి ఉంది. రెడ్డివారిపల్లె, కొత్తూరు, పత్రపల్లె ప్రజలు పొలాల వద్ద అగ్ని మంటలు వేసుకొని జాగరణ చేస్తున్నారు.

అధికారులకు సమాచారం ఇచ్చినా వారు స్పందించడం లేదని రైతులు వాపోతున్నారు. దుర్గంకొండ, బోనమంద, పత్రపల్లె అటవీ ప్రాంతం నుంచి వెదురు అక్రమంగా తరలిపోతున్నా పట్టించుకోవడంలేదని రైతులు ఆరోపిస్తున్నారు.

వైసీపీ భక్త గుడిపాల ఎస్ఐపై వేటు

● పోలింగ్ రోజు అలసత్వం వహించారని సస్పెన్షన్

● గతంలోనూ రెండుసార్లు వీఆర్‌కు..

● చిత్తూరు వైసీపీ అభ్యర్థికి విధేయుడిగా ముద్ర



చిత్తూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో వైసీపీకి అనుకూలంగా పనిచేసి ప్రతిపక్షాలను ఇబ్బంది పెట్టిన గుడిపాల ఎస్ఐ శ్రీనివాసరావు సస్పెండయ్యారు. పోలింగ్ రోజున అలసత్వం వహించారని ఉన్నతాధికారులు ఆయన్ను సస్పెండ్ చేస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. చిత్తూరు వైసీపీ అభ్యర్థి విజయానందరెడ్డికి ముఖ్య అనుచరుడిగా ఈయన ముద్ర వేసుకున్నారు. జిల్లాలో ఆయన పనిచేసిన అన్ని పోస్టింగుల వెనుక విజయానందరెడ్డి ఉన్నట్లు పోలీసు వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. తొలుత విజయానందరెడ్డి సొంత మండలమైన ఎస్ఆర్‌పురంలో పనిచేశారు. అక్కడ ఓ యాక్సిడెంట్ కేసులో ప్రమాదానికి కారణమైన వాహనాన్ని మార్చడం, ఆలస్యంగా కేసు పెట్టడం.. వంటి విషయాలను ఉన్నతాధికారులు గుర్తించి వీఆర్‌కు పంపినట్లు సమాచారం. ఆ సమయంలో ఆయన విజయానందరెడ్డికి దగ్గరగా ఉండేవారన్న ఆరోపణలున్నాయి. వీఆర్‌లో కొంతకాలం ఉన్న తర్వాత విజయానందరెడ్డి ఒత్తిడితో జీడీనెల్లూరులో పోస్టింగ్ ఇచ్చినట్లు చెబుతారు. అక్కడా ఓ వైసీపీ నేత పట్ల దురుసుగా ప్రవర్తించడంతో.. స్టేషన్ ఎదుట ప్రధాన రహదారికి అడ్డుగా గ్రామస్థులు ధర్నా చేశారు. ఎస్ఐ శ్రీనివాసరావుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అప్పటి డీఎస్పీ శ్రీనివాసమూర్తి సర్దుబాటు చేయాల్సి వచ్చింది. బాధిత వైసీపీ నాయకులు ఎస్ఐను మార్చాల్సిందేనని డిప్యూటీ సీఎం నారాయణస్వామి వద్ద పట్టుబట్టారు. దీంతో అతడిని మళ్లీ వీఆర్‌లో ఉంచారు. ఆ తర్వాతా విజయానందరెడ్డి కల్పించుకుని కాణిపాకంలో పోస్టింగ్ ఇప్పించినట్లు డిపార్ట్‌మెంటులో గుసగుసలు వినిపిస్తున్నాయి.

ఎన్నికల ముందు గుడిపాలకు..

సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతున్న క్రమంలో గుడిపాలలో తన కోసం పనిచేసే శ్రీనివాసరావును కాణిపాకం నుంచి విజయానందరెడ్డి తెచ్చుకున్నట్లు సమాచారం. అప్పటి వరకు గుడిపాలలో పనిచేసిన ఎస్ఐ రామ్మోహన్ నిక్కచ్చిగా పనిచేసినట్లు చెబుతారు. ఇలా పనిచేసే వారితో ఎన్నికల్లో ఇబ్బంది అవుతుందని పోలీసు ఉన్నతాధికారుల మీద ఒత్తిడి తెచ్చి మార్చేసినట్లు అప్పట్లో ప్రచారం వచ్చింది. రామ్మోహన్‌కు పోలీసు అధికారులు కాణిపాకంలో పోస్టింగ్ ఇచ్చారు. గుడిపాల ఎస్ఐగా బాధ్యతలు తీసుకున్న శ్రీనివాసరావు.. తొలి రోజు నుంచీ స్వామి భక్తి చాటుకున్నారని స్థానికంగా చర్చ ఉంది. గుడిపాల పంచాయతీలో పేదల కోసం వాటర్‌ట్యాంకును టీడీపీ నాయకులు ఏర్పాటు చేశారు. వైసీపీ నేతల ఫిర్యాదుతో టీడీపీ శ్రేణుల్ని బైండోవర్ చేశారు. పోలింగ్ రోజున ఎలాంటి కారణాలు లేకున్నా వైసీపీ నేత ఫిర్యాదుతో టీడీపీ నాయకులపై చేయి చేసుకున్నారు. మండికృష్ణాపురం పోలింగ్ కేంద్రం వద్ద ఇరుపార్టీల ఘర్షణ కత్తిపోట్లకు దారితీసినా, ఎస్ఐ సకాలంలో స్పందించకుండా టీడీపీ నాయకుల మీద కేసులు పెట్టారు. చీలాపల్లె పోలింగ్ కేంద్రంలో పోలింగ్ రోజున ఇరుపార్టీల మధ్య జరిగిన ఘర్షణలో టీడీపీ వారి మీదే కేసులు పెట్టారు. ఇలా గుడిపాలలో ఇతడిపై అనేకరకాల ఆరోపణలు రావడం.. ఏకపక్షంగా పనిచేశారని ఉన్నతాధికారులు గుర్తించడంతో సస్పెన్షన్ వేటు పడింది.





చెంగాళమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

సూళ్లూరుపేట, జూన్ 2: తెలుగు, తమిళ భక్తుల ఆరాధ్య దైవమైన చెంగాళమ్మ పరమే శ్వరి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిట లాడింది. వేసవి సెలవులు చివరి దశకు రావ డంతో స్థానికులే కాకుండా తమిళనాడు నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారికి పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించుకొన్నారు. సహాయ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఆలయ సిబ్బంది భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా క్యూలైన్లలో దగ్గరుండి పంపించారు. ఎండలు అధికంగా ఉండడంతో తాగునీరు, మజ్జిగ పంపిణీ చేశారు.

కోటమ్మ ఆలయంలో...



కోట, జూన్ 2: కోట గ్రామ దేవత కోటమ్మ అమ్మవారికి ఆదివారం విశేష పూజలు జరి గాయి. ఈ సందర్భంగా అమ్మవారికి అర్చకులు పలు అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అ లంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు, ఓజిలి మండలాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆయా పట్టణాల నుంచి వచ్చిన భక్తులకు పాలక మండలి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు

చిల్లకూరు, జూన్ 2: మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో కొలువై ఉన్న ముత్యాలమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించి దర్శించుకున్నారు.

రేపు సాయంత్రానికి పూర్తి ఎన్నికల ఫలితాలు వెల్లడిస్తాం

కౌంటింగ్‌కు సర్వం సిద్ధం: కలెక్టర్



తిరుపతి(కలెక్టరేట్), జూన్ 2: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ మంగళవారం సజావుగా జరగడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టామని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. విజయవాడ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా జిల్లా అధికారులతో కౌంటింగ్ ప్రక్రియపై ఆదివారం వర్చువల్ విధానంలో సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్సుకు కలెక్టరేట్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్, డీఆర్వో పెంచలకిషోర్ హాజరయ్యారు. జిల్లా అధికారులను ఉద్దేశించి సీఈవో మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఎలాంటి అంతరాయం లేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలన్నారు. పలు అంశాలపై జిల్లా అధికారులకు దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ వివరిస్తూ.. పోస్టల్ బ్యాలెట్, ఈవీఎం ఓట్ల లెక్కింపు ప్రక్రియ సాయంత్రం 4గంటలకు పూర్తి చేసి ఫలితాలు వెల్లడిస్తామని, అందుకు తగిన చర్యలు చేపట్టామన్నారు. పూర్తి భద్రత నడుమ కౌంటింగ్ ప్రక్రియ నిర్వహిస్తామని సీఈవోకు తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయం కిటకిట







పొంగళ్లు తయారు చేస్తున్న భక్తులు - అమ్మవారి ఆలయం వద్ద రద్దీ

తిరుపతి కల్చరల్, జూన్ 2: తాతయ్యగుంట గంగమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. నగరవాసులు అత్యధిక సంఖ్యలో ఆలయానికి విచ్చేశారు. అమ్మవారికి పొంగళ్లు నైవేద్యంగా సమర్పించారు.

రేషన్‌లో భారీగా కోత

- నిన్న కందిపప్పు.. నేడు గోధుమపిండి, రాగిపిండి కట్
- ఆందోళనలో కార్డుదారులు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 2: నిన్నటి వరకు కంది పప్పు పంపిణీ చేయలేమని చేతులెత్తేసిన రాష్ట్ర ప్రభుత్వం.. తాజాగా గోధుమ పిండి, రాగి పిండి పంపిణీకి రాంరాం పలికింది. జిల్లావ్యాప్తంగా దాదాపు 5,61,453 రేషన్ కార్డులున్నాయి. వీటికి ప్రతినెలా 9,31,00 క్వింటాళ్ల బియ్యం, 595 టన్నుల కందిపప్పు, 595 టన్నుల రాగిపిండి, చక్కెర, గోధుమ పిండి విడుదల చేసేవారు. ఆరు నెలలుగా కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ఉచిత బియ్యం మాత్రమే కార్డుదారులకు రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తూ, తానివ్వాల్సిన బియ్యాన్ని ఆపేసింది. ఈ క్రమంలో అరకొరగా పంపిణీ చేస్తుండిన కంది పప్పు, గోధుమ పిండి, రాగిపిండిని ఈనెలకొచ్చేసరికి పూర్తిగా నిలిపేయడంతో కార్డుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈనెలలో బియ్యం, పంచదార మాత్రమే పంపిణీ చేస్తారని పౌరసరఫరాల శాఖ అధికారులు పేర్కొన్నారు.



వాహనం వద్ద బియ్యం తీసుకుంటున్న లబ్ధిదారులు

కౌంటింగుకు పటిష్ఠ భద్రత





పద్మావతి మహిళా వర్సిటీ వద్ద మెటల్ డిటెక్టర్లు - ఏజెంట్ల కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్లు - తీగలతో బందోబస్తు





సీతమ్మ మార్గంలో బారికేడ్లు పెట్టి తనిఖీలు - మీడియా పాయింట్ వద్ద పోలీస్ అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

ఘనంగా సంపూర్ణ సుందరకాండ అఖండ పారాయణం





అఖండ పారాయణం, పూర్ణాహుతి

16 గంటల పాటు పారాయణం చేసిన పండితులు

తిరుమల, జూన్2(ఆంధ్రజ్యోతి): తిరుమల ధర్మగిరి వేద విజ్ఞానపీఠంలో ఆదివారం సంపూర్ణ సుందరకాండ అఖండ పారాయణం ఘనంగా జరిగింది. ఉదయం 6 గంటలకు మొదలైన కార్యక్రమం పూర్ణాహుతితో పూర్తయింది. హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా సర్వమానవాళి శ్రేయస్సును కాంక్షిస్తూ వేదవిజ్ఞానపీఠం ప్రిన్సిపల్ అవధాని ఆధ్వర్యంలో టీటీడీ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. సుందరకాండలోని 2,823 శ్లోకాలను 16 గంటల్లో పఠించడం ద్వారా అన్ని సమస్యల, పాపాల నుంచి విముక్తి పొందుతామని వాల్మీకి మహర్షి తెలియజేసినట్టు పురాణాల ద్వారా తెలుస్తోంది. ఇందులో భాగా అఖండ పారాయణ యజ్ఞం నిర్వహించారు. వేదపండితులు ఈశ్లోకాలను నాలుగు బృందాలుగా ఏర్పడి పఠించారు. బాలకాండ నుంచి వంద, యుద్ధకాండ నుంచి 123, సుందరకాండలోని 2,823 కలిపి మొత్తం 3,046 శ్లోకాలు పారాయణం చేశారు. ఒకవైపు శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారు, మరోవైపు సీతాలక్ష్మణ ఆంజనేయస్వామి సమేత శ్రీరాముడు, మరోవైపు రుక్మిణీ సమేత శ్రీకృష్ణుని ఉత్సవమూర్తులను ఉండగా ధర్మగిరిలోని ప్రార్థనా మందిరాన్ని వివిధ దేవతామూర్తులతో అలంకరించారు. వేదపండితులు, భక్తులు చేసిన అఖండ సుందరకాండ పారాయణంతో ధర్మగిరి ప్రాంగణం మారుమోగింది. ఈవో ధర్మారెడ్డి, ఎస్వీబీసీ సీఈవో షణ్ముఖ్‌కుమార్, వేదిక్ యూనివర్సిటీ వీసీ రాణాసదాశివమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మలబార్‌లో ఆర్టిస్ట్రీ బ్రాండెడ్ జ్యువలరీ షో

తిరుపతి అర్బన్, జూన్ 2: స్థానిక ఎన్టీఆర్ కూడలి సమీపంలో ఉన్న మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ విక్రయశాలలో ఆర్టిస్ట్రీ బ్రాండెడ్ జ్యువలరీ ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు షోరూం ఇంచార్జ్ రిజీష్ తెలిపారు. ఈ ప్రదర్శనలో స్వర్ణ, వజ్ర, జాతి రత్నాభరణాలను ప్రదర్శించామని, అద్వితీయమైన నైపుణ్యంతో కళాత్మకంగా తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు. వివాహం, వివిధ వేడుకల సంబరాల కోసం ప్రత్యేక ఆభరణాలు ఆకర్షణీయంగా ఉంటాయని, అధునాతన డిజైన్లు తేలికపాటి ఆభరణాలు మగువలు ఇష్టపడేలా ఉన్నాయని, ఈనెల 9వ తేదీ వరకు ఈ ప్రదర్శన కొనసాగుతుందని ఆయన తెలిపారు. పురప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

'రమాదేవి'లో ఈఎన్‌టీ సర్జరీలు సక్సెస్



కోలుకున్న వారితో రమాదేవి ఆస్పత్రి వైద్య బృందం

తిరుపతి(వైద్యం), జూన్ 2: ఈఎన్‌టీ సమస్యతో బాధపడుతున్న ఇద్దరికి అతిక్లిష్టమైన సర్జరీలను విజయవంతంగా నిర్వహించామని శ్రీరమాదేవి ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ డీబీ శశధర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆస్పత్రిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఐరాల మండలం వెంగంపల్లికి చెందిన సుధాకర్‌రెడ్డి అనే రైతు ముక్కులో నుంచి కొన్నేళ్లుగా చెడువాసన, నీరు కారడం, తీవ్రమైన తలనొప్పి, శ్వాస పీల్చుకోలేకపోవడం వంటి సమస్యలతో బాధపడుతున్నాడు. గుర్రంకొండకు చెందిన సురేష్ కూడా ఐదేళ్లుగా ఇటువంటి సమస్యలతోనే ఇబ్బంది పడుతున్నాడు. వీరు పలు ఆస్పత్రుల్లో చూపించగా, ప్రయోజనం లేకపోవడంతో రమాదేవి ఆస్పత్రికి వచ్చారన్నారు. తమ ఈఎన్‌టీ వైద్య నిపుణుడు వంశీకృష్ణ పరీక్షించి, ఎండోస్కోపిక్ ప్రక్రియ ద్వారా వీరిద్దరికీ అతిక్లిష్టమైన సర్జరీలను విజయవంతంగా నిర్వహించారని ఆయన్ను ప్రశంసించారు. కోలుకున్న బాధితులను ఆదివారం డిశ్చార్జి చేశామని వివరించారు. తమ వద్ద నిపుణులైన వైద్యులు, అత్యాధునిక వైద్యపరికరాలు అందుబాటులో ఉన్నాయని, ఎంతటి క్లిష్టమైన సర్జరీలైనా ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా చేసే అవకాశం ఉందన్నారు. ఈ రెండు సర్జరీలు కూడా ఉచితంగానే చేశామన్నారు.

అంజనాద్రి హనుమత్ జన్మస్థలం

తిరుమల, జూన్2 (ఆంధ్రజ్యోతి): హనుమంతుడు అంజనాద్రి ఆకాశగంగలో జన్మించినట్టు రాయల్‌చెరువు శక్తిపీఠం మాతృశ్రీ రమ్యానంద భారతి పేర్కొన్నారు. హనుమజ్జయంతి వేడుకల్లో భాగంగా రెండవరోజు ఆదివారం తిరుమలలోని నాదనీరాజనం, ఆకాశగంగ, జపాలి తీర్థంలో నిర్వహించిన భక్తి సంగీత కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఈసందర్భంగా నాదనీరాజనం వేదికపై రమ్యానంద భారతి మాట్లాడుతూ అంజనాదేవికి వాయుదేవుని వలన జన్మించినట్టు హనుమంతుడు సీతాదేవికి తెలిపారన్నారు. మాతంగ మహర్షి చెప్పినట్టు అంజనాదేవి వేంకటాచలానికి రావడం, అక్కడ తపస్సు చేయడం, ఆంజనేయస్వామికి జన్మనివ్వడం, తదనుగుణంగా ఆ కొండకు అంజనాద్రిగా పేరు రాయడం, బాలాంజనేయస్వామి సూర్యదేవుని పట్టుకోవడానికి వేంకటాద్రి నుంచి లంఘించడం, శ్రీరాముని దర్శనానంతరం సీతాన్వేషణలో భాగంగా తిరిగి వేంకటాద్రికి రావడం, అక్కడ అంజనాదేవిని మరల చూడటం, వానరవీరులు వైకుంఠ గుహలో ప్రవేశించడం.. ఇలా అనేక విషయాలు వేంకటాచల మహాత్మ్యం నుంచి తెలుస్తున్నాయన్నారు. ఆకాశగంగలో జాతీయసంస్కృత విశ్వవిద్యాలయం అధ్యాపకులు ఆచార్య రాఘవాచార్యులు హనుమంతుని జన్మ విశేషాలు తెలిపారు. జపాలిలో కూడా తిరుపతికి చెందిన రేవతి బృందం హనుమాన్ చాలీసా పఠించారు. రవిసుబ్రహ్మణ్యం గాత్ర కచేరి నిర్వహించారు. తిరుపతికి చెందిన ప్రసన్న లక్ష్మీ బృందం కూడా హనుమాన్ చాలీసా పఠించింది. సాయంత్రం అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు సరస్వతీ ప్రసాద్ హరికథ కాలక్షేపం నిర్వహించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.54 కోట్లు

తిరుమల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.54 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం పరకామణి లెక్కింపులు నిర్వహించి టీటీడీ ఆదివారం ఉదయం ప్రకటించింది. ఇక, శనివారం 78,686 మంది శ్రీవారిని దర్శించుకున్నారు. 37,888 మంది శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

నిషేధిత జాబితా భూమిలో వివాదం

మంగళం, జూన్ 2: మంగళం పరిధిలోని సప్తగిరికాలనీ గ్రామ పంచాయతీలో మంగళం గ్రామ రెవెన్యూ సర్వే నెంబరు 31లోని రెండు ఎకరాల 65సెంట్లు భూమిని ప్రభుత్వం నిషేధిత జాబితా(22ఏ)లో ఉంచింది. గతంలో సదరు సర్వే నెంబర్‌లో భూక్రయ విక్రయాలు జరిగి రిజిస్ట్రేషన్లు నడిచాయి. ఆదివారం ఈ భూమి తమదంటూ కొందరు వ్యక్తులు నిషేధిత జాబితా సర్వే నెంబరు 31లో గల స్థలంలోనికి ఎవరూ రాకుండా ఎక్స్‌కవేటర్‌తో ఇరువైపులా పెద్ద గోతులు తీశారు. గతంలో భూమిని కొనుగోలు చేసిన కొందరు దీనిని అడ్డుకుని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, పోలీసుల సమక్షంలో గోతులను పూడ్చివేశారు. ఇదే సర్వే నెంబర్‌లో హైకోర్టు నుంచి పర్మినెంట్ ఇంజక్షన్ ఆర్డర్ తీసుకుని వెంకటేష్‌రెడ్డి అనే వ్యక్తి నిర్మాణాలు చేపట్టడంతో మూడు రోజుల క్రితమే రెవెన్యూ అధికారులు స్పందించి, పంచాయతీ కార్యదర్శి అనుమతి లేనిదే సదరు నిషేధిత జాబితా భూమిలో నిర్మాణాలు చేయరాదని సూచించారు. ఎలక్ట్రికల్ విభాగం ఏఈఈ, పంచాయతీ కార్యదర్శికి, మండల అభివృద్ధి అధికారికి తిరుపతి అర్బన్ ఎమ్మార్వో ఇదే విషయమై నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. అయినా నిర్మాణాలు కొనసాగుతుండటం గమనార్హం.



ఎక్స్‌కవేటర్‌తో గోతులను పూడ్చుతున్న దృశ్యం

సూళ్లూరుపేటలో టీడీపీ సానుభూతిపరులపై వైసీపీ దాడి

సూళ్లూరుపేట, జూన్ 2: సూళ్లూరుపేట పట్టణం కోళ్లమిట్టలో ఆదివారం రాత్రి టీడీపీ సానుభూతి పరులపై వైసీపీ వారు దాడి చేశారు. బాధితుల సమాచారం మేరకు కోళ్లమిట్టకు చెందిన శేషాద్రి రమేష్, బాబు గతంలో వైసీపీ మద్దతుదారులుగా ఉండేవారు. ఈ సారి ఎన్నికల్లో టీడీపీకి మద్దతుగా నిలిచి, ఎన్నికల్లో పనిచేశారు. దీనిపై కక్ష పెంచుకున్న వైసీపీ శ్రేణులు దాదాపు 20 మందికిపైగా కోళ్లమిట్టలో శేషాద్రి రమేష్ ఇంటి వద్దకెళ్లి ఘర్షణకు దిగారు. గమనించిన పక్కనే ఉన్న రమేష్ బంధువు బాబు, వారి కుటుంబ సభ్యులు కలిసి అడ్డుకొనేందుకు ప్రయత్నించారు. గుంపులుగా వచ్చిన వైసీపీ శ్రేణుల్లోని ఇద్దరు తమ చేతుల్లోని కత్తితో దాడి చేశారు. ఈ దాడిలో రమేష్‌కు నడుము పైభాగంలో గాయమవ్వగా, బాబుకు చేతికి కత్తిగాటు తగిలింది. వెంటనే రమేష్ బంధువులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడకు చేరుకోవడంతో దాడిచేసేందుకు వచ్చిన వైసీపీ శ్రేణులు పరారయ్యాయి. టీడీపీకి ఎన్నికల్లో పనిచేశామని తమను చంపేస్తామని కొందరు వైసీపీ నాయకులు బెదిరిస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే రాత్రి సమయంలో వైసీపీ శ్రేణులు మరణాయుధాలతో తమ ఇంటిపైకి దాడి చేశారని బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గాయపడిన రమేష్‌ను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం నెల్లూరుకు తరలించారు. దాడిచేసినవారు అధికార పార్టీకి చెందిన వారు కావడంతో పోలీసులు రాజీ కుదిర్చే ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

నేటి పాలిసెట్ కౌన్సెలింగ్ వాయిదా

తిరుపతి(విద్య), జూన్ 2: తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం జరగాల్సిన పాలిసెట్ కౌన్సెలింగ్‌ను వాయిదా వేసినట్టు కోఆర్డినేటర్ వై.ద్వారకానాథరెడ్డి తెలిపారు. 3వ తేదీ జరగాల్సిన కౌన్సెలింగ్ ఈనెల 6వ తేదీన జరుగుతుందని, ఈ విషయాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు గుర్తించాలని సూచించారు. కళాశాలలో ఏడో రోజైన ఆదివారం జరిగిన పాలిసెట్ కౌన్సెలింగ్‌కు 175 మంది విద్యార్థులు హాజరయ్యారని వెల్లడించారు. 92001- 108000 ర్యాంకుల మధ్య ఉన్న విద్యార్థుల సర్టిఫికెట్లను పరిశీలించామని పేర్కొన్నారు. ఆరోతేదీన 108001 నుంచి చివరి ర్యాంకు వరకు ఉన్న విద్యార్థులకు కౌన్సెలింగ్ జరుగుతుందని వివరించారు.చీఫ్ వెరిఫికేషన్ ఆఫీసర్ జి.కృష్ణమూర్తి నాయుడు, అసిస్టెంట్ కోఆర్డినేటర్ ఎస్.సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.

బాలాంజనేయస్వామికి దళార్చన

తిరుమల, జూన్2(ఆంధ్రజ్యోతి): హనుమత్ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆకాశగంగలో అంజనాదేవి సమేత బాలాంజనేయస్వామికి ఆదివారం ఏకాదశి సందర్భంగా నాగవల్లి దళార్చన (తమలపాకులతో) విశేష సహస్రనామార్చనను నిర్వహించారు. ఈసందర్భంగా టీటీడీ వైఖానస ఆగమ సలహాదారు మోహనరంగాచార్యులు హనుమంతుడి విశిష్టత, ఆకాశ గంగలోని బాలాంజనేయస్వామి విశిష్టతను వివరించారు. అనంతరం స్వామివారికి పంచామృత స్నపన తిరుమంజనం జరిగింది. తమలపాకులతో సహస్రనామ అర్చన నిర్వహించారు.

గిరిజనుడి ఆత్మహత్య

కోట, జూన్ 2 : మండలం చిట్టేడులో గిరిజనుడు ఆదివారం పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... గ్రామానికి చెందిన కె.మస్తానయ్య (40) కుటుంబసభ్యులతో చిన్నపాటి విషయమై గొడవపడి మనస్తాపానికి గురయ్యాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగులమందు తాగాడు. గమనించిన కుటుంబీకులు ఆయన్ను కోట పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకురాగా అప్పటికే ఆయన మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తూతూమంత్రంగా ఫైర్ ఫైటింగ్ వ్యవస్థ

పరిశ్రమలు, వాణిజ్య సంస్థల్లో ఏడాదిలో 4 భారీ అగ్ని ప్రమాదాలు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 2: జిల్లాలో దాదాపు 356 భారీ పరిశ్రమలున్నాయి. వీటితో పాటు మరో 1,800 వాణిజ్య సంస్థలున్నాయి. వీటిల్లో రెడ్, ఆరంజ్ జోన్‌లో వున్న పరిశ్రమలు దాదాపు 159 వరకు ఉన్నాయని అగ్నిమాపక శాఖ అధికారుల గణాంకాలు చెపుతున్నాయి. వీటిల్లో చాలావరకు అగ్నిమాపక నిరోధక (ఫైర్ ఫైటింగ్) వ్యవస్థ సరిగా లేనట్లు ప్రభుత్వానికి నివేదికలు వెళ్లాయి. ఈ కారణం వల్లే గత ఏడాది జూన్ నుంచి ఇప్పటివరకు దాదాపు నాలుగు భారీ అగ్ని ప్రమాదాలు జరిగాయి. ఇందులో దాదాపు రూ.30కోట్ల ఆస్తి నష్టం సంభవించింది. ఇకనైనా అధికారులు తరచూ తనిఖీ చేస్తే ఇటువంటిని అరికట్టవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రమాదాలిలా..

- గత ఏడాది జూన్‌లో తిరుపతికి నడి బొడ్డున వున్న లావణ్య ఫొటో ఫ్రేమ్స్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. దాదాపు 25.12 కోట్ల ఆస్తి నష్టం వాటిల్లింది.
- ఈ ఏడాది ఫిబ్రవరి 15న రేణిగుంటలోని శ్రీవారి ప్యాకింగ్ సొల్యూషన్స్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన అగ్ని ప్రమాదంలో దాదాపు రూ.5కోట్ల ఆస్తి నష్టం జరిగింది.
- ఈ ఏడాది ఏప్రిల్ 24న రేణిగుంట ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని శ్రీ రాధే ప్లాస్టిక్స్‌లో జరిగిన భారీ అగ్ని ప్రమాదంలో రూ.28.60 లక్షల ఆస్తి నష్టం సంభవించింది.
- ఈ ఏడాది ఫిబ్రవరి 25వ తేదీన తిరుపతి నగరం వీవీ మహల్ రోడ్డులోని నోవా కలెక్షన్స్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో దాదాపు రూ.79 లక్షల ఆస్తి నష్టం సంభవించింది.

తనిఖీలు నిర్వహిస్తాం

జిల్లా వ్యాప్తంగా పరిశ్రమలు, వాణిజ్య, వర్తక సంస్థల్లో ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తాం. ఇప్పటికే చాలా సంస్థలను పరిశీలించి, నివేదికలను ప్రభుత్వానికి సమర్పించాం.

- రమణ, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి

ఏకగ్రీవంగా ఏపీ హంస తిరుపతి తాలుకా నూతన కమిటీ



ఏకగ్రీవంగా ఎన్నికైన కమిటీ సభ్యులతో ఏపీ హంస నేతలు

తిరుపతి(వైద్యం), జూన్ 2: వైద్య ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడమే ఏపీ హంస లక్ష్యమని ఆ అసోసియేషన్ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు రాజా పేర్కొన్నారు. స్థానిక యూత్ హాస్టల్లో ఆదివారం ఆయన ఆధ్వర్యంలో నిర్వహించిన ఏపీ హంస(ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్) తిరుపతి తాలుకా యూనిట్ ఎన్నికల్లో నూతన కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సి.రాజేష్, సెక్రటరీగా ఎస్.సురేంద్ర, ట్రెజరర్‌గా ఎ.శాంతకుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా స్వర్ణలత, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పి.సురేష్‌కుమార్, పబ్లిసిటీ సెక్రటరీగా ఎస్.ఈశ్వరయ్య, మహిళావింగ్ సెక్రటరీగా పి.అరుణమ్మ, వైస్ ప్రెసిడెంట్‌లుగా గంగమ్మ, పద్మజ, కాంచన, జయలక్ష్మీ, సునీల్‌కుమార్, జాయింట్ సెక్రటరీగా మమత, శోభారాణి, షకీలా భాను, జ్యోతిలక్ష్మీ, పద్మావతి, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా హరికృష్ణ, దాక్షాయణి, లావణ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఇమ్రాన్, గీతారాణి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తలు సంయమనంగా ఉండాలి

మంగళం, జూన్ 2: ముఖ్యమంత్రిగా చంద్రబాబు, చంద్రగిరి ఎమ్మెల్యేగా పులివర్తి నానీ గెలుపు ఖాయమైందని టీడీపీ రాష్ట్ర బీసీసెల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీనివాసయాదవ్ ఓ ప్రకటనలో తెలిపారు. కౌంటింగ్ రోజు టీడీపీ నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటించాలన్నారు. చంద్రబాబుకు, పులివర్తి నానీకి ఆయన ముందస్తుగా అభినందనలు తెలిపారు.

కిటకిటలాడిన మద్యం దుకాణాలు



కోర్టు సెంటర్ సమీపంలోని మద్యం దుకాణం వద్ద రద్దీ

గూడూరు అర్బన్, జూన్ 2: మద్యం దుకాణాలు ఆదివారం మద్యం ప్రియులతో కిటకిటలాడియి. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఈనెల 4న మంగళవారం కౌంటింగ్ నేపథ్యంలో సోమవారం సాయంత్రం నుంచి బుధవారం వరకు మద్యం దుకాణాలను మూసివేసేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. దీంతో మూడు రోజుల పాటు మద్యం దుకాణాలు మూతపడనుండడంతో మద్యం బాబులు ముందుగానే మద్యం కొనుగోలు చేసేందుకు బారులు తీరారు. కౌంటింగ్ ప్రక్రియ జరిగే సమయంలో ఎటువంటి అల్లర్లు జరకుండా అధికారులు బందోబస్తు ఏర్పాటు చేస్తున్న క్రమంలో ముందస్తు చర్యల్లో భాగంగా మద్యం దుకాణాలను మూసివేస్తున్నారు. ఈక్రమంలో మద్యం కొనుగోలుకు ఎగబడుతున్నారు. మద్యం దుకాణాలను మూసివేస్తుండడంతో కొందరు మద్యాన్ని స్టాక్ చేసుకుని దొంగచాటుగా అధిక ధరలకు విక్రయించేందుకు సన్నాహాలు చేసుకున్నట్లు తెలుస్తోంది.

మినీ ట్రాన్స్‌పోర్టు అసోసియేషన్ నూతన కమిటీ



గూడూరు, జూన్ 2: పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం మినీ లారీ ట్రాన్స్‌పోర్టు కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా రాజగోపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా సుధాకర్, కార్యదర్శిగా ఈశ్వరయ్య, సహాయ కార్యదర్శిగా మస్తాన్‌తోపాటు కార్యవర్గ సభ్యులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో శివకుమార్, శంకరయ్య, బి.వి.రమణయ్య, సురేష్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు

చిల్లకూరు, జూన్ 2: మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో కొలువై ఉన్న ముత్యాలమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించి దర్శించుకున్నారు. అనంతరం భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.


కోటమ్మ ఆలయంలో...



కోట, జూన్ 2: కోట గ్రామ దేవత కోటమ్మ అమ్మవారికి ఆదివారం విశేష పూజలు జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి అర్చకులు పలు అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు, ఓజిలి మండలాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆయా పట్టణాల నుంచి వచ్చిన భక్తులకు పాలకమండలి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

చెంగాళమ్మ ఆలయంలో భక్తుల రద్దీ





సూళ్లూరుపేట, జూన్ 2: తెలుగు, తమిళ భక్తుల ఆరాధ్య దైవమైన చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వేసవి సెలవులు చివరి దశకు రావడంతో స్థానికులే కాకుండా తమిళనాడు నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారికి పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించుకొన్నారు. సహాయ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఆలయ సిబ్బంది భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా క్యూలైన్లలో దగ్గరుండి పంపించారు. ఎండలు అధికంగా ఉండడంతో తాగునీరు, మజ్జిగ పంపిణీ చేశారు.

శాస్త్రోక్తంగా
శ్రీరామ హనుమాన్ మూలమంత్ర హోమం




సూళ్లూరుపేట, జూన్ 2: పట్టణంలోని బాలాంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీరామ హనుమాన్ మూలమంత్ర హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో హోమగుండం ఏర్పాటు చేసి వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ హోమాన్ని నిర్వహించారు. ఉదయం స్వామివారికి విశేష పూజలు చేసి పుష్పాలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు



గూడూరు, జూన్ 2:చదువులతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని బలిజ విద్యా దీవెన కార్యక్రమ నిర్వాహకుడు సారంగం శ్రీనివాసులు అన్నారు. ఆదివారం రెండో పట్టణ పరిధిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో బలిజ అభ్యుదయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బలిజ విద్యాదీవెన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బలిజ విద్యార్థులను చదువులలో ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో టెన్త్‌లో ప్రతిభచాటిన 11 మందికి ఒక్కొక్కరికి రూ.5వేలతోపాటు ఫైళ్లను అందించారు. కార్యక్రమంలో ఎం.వి.రమణయ్య, టి.రాఘవయ్య, టి.కృష్ణయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



సూళ్లూరుపేట, జూన్ 2: హనుమాన్ జయంతిని పురస్కరించుకొని వాసవి క్లబ్, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో హనుమాన్ చాలిసా పోటీలను సత్యసాయి మందిరంలో నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆదివారం వాసవి క్లబ్ జోన్ ఛైర్మన్ సునీత చేతుల మీదుగా బహుమతులు అందించారు. సాయిరాం, ఆర్.సుబ్రమణ్యం, శైలజ, రమేష్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

తేలికపాటి జల్లులు

వెంకటగిరి టౌన్, జూన్ 2: నాలుగు రోజులుగా భానుడు తన ప్రతాపం చూపించాడు. ఆదివారం మధ్యాహ్నం 3గంటల వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉండింది. ఉన్నట్టుండి తేలికపాటి చిరుజల్లులతో చల్లబడింది. అయితే ఒక్కసారిగా వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందారు. నైరుతి రుతుపవనాలు మరో మూడు రోజుల్లో రాష్ట్రాన్ని తాకుతున్నాయన్న వార్తతో ప్రజలు, రైతులు సంతోషంగా ఉన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

మంగళవారం టెన్షన్

రేపటి కౌంటింగ్ నేపథ్యంలో సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసు పికెట్లు ● ఎగ్జిట్ పోల్స్ నేపథ్యంలో ఎవరి ధీమా వారిదే


పెళ్లకూరులో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు




గూడూరు పట్టణంలోని సంఘం థియేటర్ వద్ద, వెంకటగిరి పాత బస్టాండ్ వద్ద పోలీసు బందోబస్తు

తడ, జూన్ 2: సార్వత్రిక ఎన్నికల తుది అంకానికి అంతా సిద్ధమైంది. ఇటు పార్టీల్లో అటు అధికారుల్లో మంగళవారం టెన్షన్ నెలకొంది. సార్వత్రిక ఎన్నికలు మొదలై గతనెల 13న పోలింగ్ జరిగింది. దీనికి సంబంధించి ఈనెల 4న కౌంటింగ్ ప్రక్రియ మొదలు కానుంది. పోలింగ్ రోజు, ఆ తరువాత వివిధ ప్రాంతాల్లో ఘర్షణలు తలెత్తడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. సూళ్లూరుపేట నియోజకవర్గంలో సమస్యాత్మక గ్రామాల్లో పోలీసు పికెట్లు ఏర్పాటు చేశారు. అలాగే మొబైల్ బృందాలను ఏర్పాటు చేసి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడవద్దంటూ ప్రజలను హెచ్చరిస్తున్నారు. 144 సెక్షన్ పక్కాగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. మరోవైపు శనివారం సాయంత్రం అన్ని ఎగ్జిట్ పోల్స్ విడుదల కావడంతో టీడీపీ, వైసీపీలో విజయంపై ఎవరి ధీమా వారు వ్యక్తం చేస్తున్నారు. తామే అధికారంలోకి రాబోతున్నామంటూ ఖరాఖండిగా చెబుతున్నారు. ఎగ్జిట్ పోల్స్ ఇంచుమించుగా టీడీపీకి అనుకూలంగా ఉండడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల్లో జోష్ కనిపిస్తోంది. నిన్నటి వరకు పదెం రాయిళ్ల వైసీపీ గెలిస్తే ఒకటికి రెండింతలు ఇస్తామంటూ కాయగా ఎగ్జిట్‌పోల్స్ తరువాత పదివేలకు ముప్పైవేలు ఇస్తామంటూ టీడీపీ అనుకూల వ్యక్తులు సై అంటున్నారు. ఏదిఏమైనా మంగళవారం నాటికి ఎవరు విజేతో తేలిపోనుంది.

లెక్కింపు వేళ పటిష్ఠ బందోబస్తు

వెంకటగిరి టౌన్: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా వెంకటగిరి పట్టణంలో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రధాన రాజకీయపక్షాల కార్యాలయాలు, అభ్యర్థుల ఇళ్ల వద్ద ఆదివారం నుంచి పోలీసు బలగాలు మోహరించాయి. అన్ని వైపులా పోలీసు యంత్రాంగం నిఘాను ముమ్మరం చేసింది. పోలింగ్ రోజున వెంకటగిరి నియోజకవర్గంలోని సమస్యాత్మక ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. పోలింగ్ అనంతరం రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల పరిస్థితులు అదుపు తప్పిన నేపథ్యంలో ఓట్ల లెక్కింపు రోజున శాంతిభద్రతలకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘం ఆదేశించిన నేపథ్యంలో అభ్యర్థులకు పోలీసులకు రక్షణ కల్పించారు. ముఖ్యంగా టీ, టిఫిన్ అంగళ్ల వద్ద గుంపుగా ప్రజలు ఉంటే ఆ యజమానులపై కేసులు పెడతామని సీఐ సంగమేశ్వరరావు ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసి ఉన్నారు.

బైండోవర్లు, కౌన్సెలింగ్....

పోలింగ్ రోజు, ఆ తర్వాత అల్లర్లలో పాల్గొన్న వారిని గుర్తించి ముందుగానే బైండోవర్ చేస్తున్నారు. ఇప్పటి వరకు 300మందిని బైండోవర్ చేసుకున్నామని, మరో 20మందిపై రౌడీషీట్ నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

పరిపాలనా దక్షుడికి
పట్టం కట్టారు: నెలవల

వైసీపీ అరాచక, అవినీతి ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేలా ఓటర్లు పోటెత్తారని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. టీడీపీకి అనుకూలంగా చంద్రబాబును సీఎం చేయాలనే నినాదంతో ఓటర్లలో ఊపు కనిపించిందన్నారు. ఎగ్జిట్‌పోల్స్ సైతం టీడీపీకే అనుకూలంగా ఉన్నాయన్నారు.

సంక్షేమమే గెలిపిస్తుంది: కిలివేటి

వైసీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలే తమను గెలిపిస్తాయని సూళ్లూరుపేట వైసీపీ అభ్యర్థి కిలివేటి సంజీవయ్య అన్నారు. ప్రజలు మరోసారి వైసీపీ పట్టం కట్టబెడుతున్నట్టు విశ్వసనీయత కలిగిన ఆరా మస్తాన్, జన్‌మత్ వంటి సర్వే సంస్థలు ఎగ్జిట్ పోల్స్ వెల్లడించాయన్నారు. మరోసారి తమదే అధికారమని సంజీవయ్య అన్నారు.

ఎగ్జిట్ పోల్స్...
గెలుపు అంచనాల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు

గూడూరు, జూన్ 2: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి శనివారం సాయంత్రం పలు సర్వే సంస్థలు ఎగ్జిట్ పోల్స్‌ను ప్రకటించడంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు గెలుపు ధీమాలో ఉన్నారు. ప్రధానంగా పలు సర్వే సంస్థలు ఎన్డీఏ కూటమికి అనుకూలంగా ఫలితాలు ప్రకటించడంతో గూడూరు నియోజకవర్గంలో దాదాపు టీడీపీ అభ్యర్థి పాశిం సునీల్ కుమార్ గెలుపు ఖాయమని ఆ పార్టీ నాయకులు అభిప్రాయపడుతున్నారు. మరికొన్ని సర్వే సంస్థలు వైసీపీకి అనుకూలంగా ఫలితాలు ప్రకటించడంతో గూడూరులో వైసీపీ అభ్యర్థి మురళీధర్ గెలుస్తాడని ఆ పార్టీ నాయకులు అంచనాలు వేస్తున్నారు. మే 13న సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. ఫలితాలు జూన్ 4 ప్రకటించనుండడంతో 22 రోజుల పాటు విజయంపై ఇరుపార్టీల నాయకులు, ప్రజలు ఉత్కంఠంగా ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం గూడూరు రారాజు ఎవరో తేలనుంది. గూడూరు నియోజకవర్గ పరిధిలో 2,45,205 ఓట్లు ఉండగా ఈ ఎన్నికల్లో 1,93,465 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. సర్వే సంస్థలు ఎక్కువ శాతం ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తుందని ప్రకటించడంతో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు ఉత్సాహంగా ఉన్నాయి. ప్రధానంగా టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన సూపర్-6కు ప్రజల నుంచి ఆదరణ రావడం, వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలను, అవినీతిని, అరాచకాలను తట్టుకోలేక ప్రజలు ఈ ఎన్నికల్లో టీడీపీకి మద్దతుగా నిలిచారని దీంతో గెలుపు తథ్యమని ఆ నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులు వైసీపీ వైపే మొగ్గుచూపారని దీంతో తమ అభ్యర్థే గెలుస్తాడని ఆ పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఈ నియోజకవర్గంలో అభ్యర్థుల గెలుపోటములపై బెట్టింగులు జోరుగా సాగుతున్నాయి.

ఒలంపిక్స్‌లో పతకమే లక్ష్యం

జూడో పరిచయ వేదిక ప్రారంభోత్సవంలో పారిశ్రామికవేత్త గంగాప్రసాద్ పిలుపు




జ్యోతి ప్రజ్వలన చేస్తున్న గంగాప్రసాద్, విజయభాస్కర్‌రెడ్డి తదితరులు - క్రీడాకారుడికి టెక్నిక్ నేర్పుతున్న శిక్షకుడు

నాయుడుపేట, జూన్ 2: పురాతనమైన జూడో మార్షల్ ఆర్ట్స్‌ను ఆంధ్ర రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడం దేశానికే తలమానికమని, ఒలంపిక్స్‌లో పతకమే లక్ష్యంగా కృషి చేయాలని ప్రముఖ పారిశ్రామిక వేత్త, టీడీపీ సీనియర్ నేత కొండేపాటి గంగాప్రసాద్ అన్నారు. నాయుడుపేట కేఎంఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం జూడో పరిచయ వేదికను జ్యోతి ప్రజ్వలనతో ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఎస్.విజయ భాస్కర్‌రెడ్డి, పెంచలకోన ట్రస్టు బోర్డు మాజీ అధ్యక్షుడు తానంకి నానాజీ, ఏపీ జూడో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏ.నాగూరయ్య, జీబీసీ మీడియా ఛైర్‌పర్సన్ జె.శైలజ, జూడో డైరెక్టర్‌తో కలసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా నాగూరయ్య మాట్లాడుతూ.. 2014లో ఆంధ్ర రాష్ట్రంలో ఏపీ జూడో అసోసియేషన్ రెండు రాష్ట్ర కమిటీలుగా ఏర్పడి జూడోను పరిచయం చేశాయన్నారు. 3వ రాష్ట్ర కమిటీ జూడోను జాతీయ, ఆసియా నుంచి అంతర్జాతీయంగా తెలుగు క్రీడాకారులను పరిచయం చేయడంతోపాటు ఒలంపిక్స్‌లో బంగారు పతకాలు సాధించేందుకు ఏర్పాటైందన్నారు. జూడో వ్యక్తిగత క్రీడ అని ఎంతో సురక్షిత షైం దన్నారు. జూడో క్రీడకు ప్రత్యేకమైన దుస్తులు ధరించడం కారణంగా శిక్షణ సందర్భంగా గాయాలయ్యే అవకాశం లేదన్నారు. మండలస్థాయికి జూడోను చేరుస్తామన్నారు. 2032 ఒలంపిక్స్‌లో జూడోలో తెలుగు క్రీడాకారులు పతకాలు పొందేలా శిక్షణ ఇస్తామన్నారు. ఏపీ జూడో అసోసియేషన్ డైరెక్టర్లు ఆర్.రమేష్‌నాయుడు, పి.మల్లికార్జున్‌రెడ్డి, కె.అశోక్‌కుమార్, కె.రోషన్ బాలచంద్ర, సీహెచ్ అప్పాజీ, డాక్టర్ అనుదీప్, డాక్టర్ సందీప్, బట్టా సుబ్రహ్మణ్యం, కె. ధనంజయవర్మ పాల్గొన్నారు.

వడదెబ్బపై అప్రమత్తంగా ఉండండి

పెళ్లకూరు, జూన్ 2: వడగాడ్పులు వీస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని పెళ్లకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సుజాత సూచించారు. ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ... వాతావరణంలో భారీ మార్పుల కారణంగా ఉష్ణోగ్రతలు పెరిగి వడగాడ్పులతో ఉక్కపోత ఉంటుందని తెలిపారు. తప్పనిసరి అయితే తప్ప ఇంటి నుంచి బయటకు వెళ్లకూడదన్నారు. ఒకవేళ వెళ్లాల్సి వస్తే టోపీ, లేదా గొడుగు వినియోగించాలన్నారు. ఓఆర్ఎస్, మజ్జిగ, నిమ్మరసం తదితర పానీయాలు తరచూ సేవించాలని సూచించారు.

గిరిజనుడి ఆత్మహత్య

కోట, జూన్ 2 : మండలం చిట్టేడులో గిరిజనుడు ఆదివారం పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... గ్రామానికి చెందిన కె.మస్తానయ్య (40) కుటుంబసభ్యులతో చిన్నపాటి విషయమై గొడవపడి మనస్తాపానికి గురయ్యాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగులమందు తాగాడు. గమనించిన కుటుంబీకులు ఆయన్ను కోట పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకురాగా అప్పటికే ఆయన మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోటలో భానుడి భగభగలు


నిర్మానుష్యంగా ఉన్న గాంధీబొమ్మ సెంటర్

కోట, జూన్ 2: మండల పరిధిలో ఆదివారం ఎండ తీవ్రత ఎక్కువైంది. గత నాలుగు రోజుల నుంచి వడగాడ్పులతో కోట, విద్యానగర్‌లోని పలు మెయిన్ బజారుసెంటర్లు వెలవెలబోయాయి. ఎండ తీవ్రత తట్టుకోలేక యజమానులంతా దుకాణాలు మూసేసి ఇళ్లకే పరిమితమయ్యారు. పనులమీద మండల కేంద్రానికి వచ్చే జనం ఎండకు భయపడి గ్రామాలకే పరిమితమయ్యారు. దీంతో ఆయా బజారుసెంటర్లు అన్నీ అటు దుకాణాల మూతతో, ఇటు జనంలేక వెలవెలబోయాయి.

ఏకగ్రీవంగా ఏపీ హంస తిరుపతి తాలుకా కమిటీ

తిరుపతి(వైద్యం), జూన్ 2: వైద్య ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడమే ఏపీ హంస లక్ష్యమని అసోసియేషన్ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు రాజా పేర్కొన్నారు. స్థానిక యూత్ హాస్టల్లో ఆదివారం ఆయన ఆధ్వర్యంలో నిర్వహించిన ఏపీ హంస(ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్) తిరుపతి తాలుకా యూనిట్ ఎన్నికల్లో నూతన కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సి.రాజేష్, సెక్రటరీగా ఎస్.సురేంద్ర, ట్రెజరర్‌గా ఎ.శాంతకుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా స్వర్ణలత, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పి.సురేష్‌కుమార్, పబ్లిసిటీ సెక్రటరీగా ఎస్.ఈశ్వరయ్య, మహిళావింగ్ సెక్రటరీగా పి.అరుణమ్మ, వైస్ ప్రెసిడెంట్‌లుగా గంగమ్మ, పద్మజ, కాంచన, జయలక్ష్మీ, సునీల్‌కుమార్, జాయింట్ సెక్రటరీగా మమత, శోభారాణి, షకీలా భాను, జ్యోతిలక్ష్మీ, పద్మావతి, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా హరికృష్ణ, దాక్షాయణి, లావణ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఇమ్రాన్, గీతారాణి తదితరులు పాల్గొన్నారు.

నేటి పాలిసెట్ కౌన్సెలింగ్ వాయిదా

ఏడో రోజున 175 మంది హాజరు

తిరుపతి(విద్య), జూన్ 2: తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం జరగాల్సిన పాలిసెట్ కౌన్సెలింగ్‌ను వాయిదా వేసినట్టు కోఆర్డినేటర్ వై.ద్వారకానాథరెడ్డి తెలిపారు. 3వ తేదీ జరగాల్సిన కౌన్సెలింగ్ ఈనెల 6వ తేదీన జరుగుతుందని, ఈ విషయాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు గుర్తించాలని సూచించారు. కళాశాలలో ఏడో రోజైన ఆదివారం జరిగిన పాలిసెట్ కౌన్సెలింగ్‌కు 175 మంది విద్యార్థులు హాజరయ్యారని వెల్లడించారు. 92001 - 108000 ర్యాంకుల మధ్య ఉన్న విద్యార్థుల సర్టిఫికెట్లను పరిశీలించామని పేర్కొన్నారు. ఆరో తేదీన 108001 నుంచి చివరి ర్యాంకువరకు ఉన్న విద్యార్థులకు కౌన్సెలింగ్ జరుగుతుందని వివరించారు. చీఫ్ వెరిఫికేషన్ ఆఫీసర్ జి.కృష్ణమూర్తి నాయుడు, అసిస్టెంట్ కోఆర్డినేటర్ ఎస్.సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌లో భారీగా కోత

- **నిన్న కందిపప్పు.. నేడు గోధుమపిండి, రాగిపిండి కట్**
- **ఆందోళనలో కార్డుదారులు**


వాహనం వద్ద బియ్యం తీసుకుంటున్న కార్డుదారులు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 2: నిన్నటి వరకు కందిపప్పు పంపిణీ చేయలేమని చేతులెత్తేసిన రాష్ట్ర ప్రభుత్వం.. తాజాగా గోధుమ పిండి, రాగి పిండి పంపిణీకి రాంరాం పలికింది. జిల్లావ్యాప్తంగా దాదాపు 5,61,453 రేషన్ కార్డులున్నాయి. వీటికి ప్రతినెలా 9,31,00 క్వింటాళ్ల బియ్యం, 595 టన్నుల కందిపప్పు, 595 టన్నుల రాగిపిండి, చక్కెర, గోధుమపిండి విడుదల చేసేవారు. ఆరు నెలలుగా కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ఉచిత బియ్యం మాత్రమే కార్డుదారులకు రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తూ, తానివ్వాల్సిన బియ్యాన్ని ఆపేసింది. ఈ క్రమంలో అరకొరగా పంపిణీ చేస్తుండిన కందిపప్పు, గోధుమ పిండి, రాగిపిండిని ఈనెలకొచ్చేసరికి పూర్తిగా నిలిపేయడంతో కార్డుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈనెలలో బియ్యం, పంచదార మాత్రమే పంపిణీ చేస్తారని పౌరసరఫరాల శాఖ అధికారులు పేర్కొన్నారు.

'రమాదేవి'లో ఈఎన్‌టీ సర్జరీలు సక్సెస్


కోలుకున్న బాధితులతో రమాదేవి ఆస్పత్రి వైద్య బృందం

తిరుపతి(వైద్యం), జూన్ 2: ఈఎన్‌టీ సమస్యతో బాధపడుతున్న ఇద్దరికి అతిక్లిష్టమైన సర్జరీలను విజయవంతంగా నిర్వహించామని తిరుపతిలోని శ్రీరమాదేవి ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ డీబీ శశధర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆస్పత్రిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఐరాల మండలం వెంగంపల్లికి చెందిన సుధాకర్‌రెడ్డి అనే రైతు ముక్కులో నుంచి కొన్నేళ్లుగా చెడువాసన, నీరు కారడం, తీవ్రమైన తలనొప్పి, శ్వాస పీల్చుకోలేకపోవడం వంటి సమస్యలతో బాధపడుతున్నాడు. గుర్రంకొండకు చెందిన సురేష్ కూడా ఐదేళ్లుగా ఇటువంటి సమస్యలతోనే ఇబ్బంది పడుతున్నాడు. వీరు పలు ఆస్పత్రుల్లో చూపించగా, ప్రయోజనం లేకపోవడంతో రమాదేవి ఆస్పత్రికి వచ్చారన్నారు. తమ ఈఎన్‌టీ వైద్య నిపుణుడు వంశీకృష్ణ పరీక్షించి, ఎండోస్కోపిక్ ప్రక్రియ ద్వారా వీరిద్దరికీ అతిక్లిష్టమైన సర్జరీలను విజయవంతంగా నిర్వహించారని ఆయన్ను ప్రశంసించారు. కోలుకున్న బాధితులను ఆదివారం డిశ్చార్జి చేశామని వివరించారు. తమ వద్ద నిపుణులైన వైద్యులు, అత్యాధునిక వైద్యపరికరాలు అందుబాటులో ఉన్నాయని, ఎంతటి క్లిష్టమైన సర్జరీలైనా ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా చేసే అవకాశం ఉందన్నారు. ఈ రెండు సర్జరీలు కూడా ఉచితంగానే చేశామన్నారు.

గ్రంథాలయంలో చెస్ పోటీలు



వెంకటగిరి టౌన్, జూన్ 2: పట్టణంలోని తూర్పువీధిలో ఉన్న గ్రంథాలయంలో వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా గ్రథాలయ అధికారి అంజయ్య ఆదివారం విద్యార్థులకు చెస్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు పోటీలు నిర్వహించినట్టు చెప్పారు. అనంతరం ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. 7వ తేది వరకు శిక్షణకార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

తడ, జూన్ 2: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి చెందాడు. పట్టణంలోని సుజాత నగర్‌లో నివాసం ఉంటున్న రోశయ్య(57) శనివారం సాయంత్రం కారు ఢీ కొన్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ విషయం తెలిసిందే. క్షతగాత్రుడిని నెల్లూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఈ మేరకు పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబీకులకు అందజేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.54 కోట్లు

తిరుమల, జూన్2(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.54 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు రూ.3.54 కోట్లు ఆదాయం లభించినట్టు టీటీడీ ఆదివారం ఉదయం ప్రకటించింది. ఇక, శనివారం 78,686 మంది శ్రీవారిని దర్శించుకున్నారు. 37,888 మంది శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

వడదెబ్బకు వృద్ధుడి మృతి


మునికృష్ణమనాయుడు (ఫైల్ ఫొటో)

చంద్రగిరి, జూన్ 2: వడదెబ్బకు గురై ఓ వృద్ధుడు మృతి చెందాడు. చంద్రగిరి మండలం కొటాల గ్రామానికి చెందిన మునికృష్ణమనాయుడు(64) మూడు రోజులుగా ఎండ తీవ్రతకు తట్టుకోలేక తీవ్ర అస్వస్థతకు గురై శనివారం రాత్రి మృతి చెందాడని కుటుంబీకులు తెలిపారు.

సూళ్లూరుపేటలో
టీడీపీ సానుభూతిపరులపై వైసీపీ దాడి

సూళ్లూరుపేట, జూన్ 2: సూళ్లూరుపేట పట్టణం కోళ్లమిట్టలో ఆదివారం రాత్రి టీడీపీ సానుభూతి పరులపై వైసీపీ వారు దాడి చేశారు. బాధితుల సమాచారం మేరకు కోళ్లమిట్టకు చెందిన శేషాద్రి రమేష్, బాబు గతంలో వైసీపీ మద్దతుదారులుగా ఉండేవారు. ఈ సారి ఎన్నికల్లో టీడీపీకి మద్దతుగా నిలిచి, ఎన్నికల్లో పనిచేశారు. దీనిపై కక్ష పెంచుకున్న వైసీపీ శ్రేణులు దాదాపు 20 మందికిపైగా కోళ్లమిట్టలో శేషాద్రి రమేష్ ఇంటి వద్దకెళ్లి ఘర్షణకు దిగారు. గమనించిన పక్కనే ఉన్న రమేష్ బంధువు బాబు, వారి కుటుంబ సభ్యులు కలిసి అడ్డుకోసేందుకు ప్రయత్నించారు. గుంపులుగా వచ్చిన వైసీపీ శ్రేణుల్లోని ఇద్దరు తమ చేతుల్లోని కత్తితో దాడి చేశారు. ఈ దాడిలో రమేష్‌కు నడుము పైభాగంలో గాయమవ్వగా, బాబుకు చేతికి కత్తిగాటు తగిలింది. వెంటనే రమేష్ బంధువులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడకు చేరుకోవడంతో దాడిచేసేందుకు వచ్చిన వైసీపీ శ్రేణులు పరారయ్యాయి. టీడీపీకి ఎన్నికల్లో పనిచేశామని తమను చంపేస్తామని కొందరు వైసీపీ నాయకులు బెదిరిస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే రాత్రి సమయంలో వైసీపీ శ్రేణులు మరణాయుధాలతో తమ ఇంటిపైకి దాడి చేశారని బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గాయపడిన రమేష్‌ను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం నెల్లూరుకు తరలించారు. దాడిచేసినవారు అధికార పార్టీకి చెందిన వారు కావడంతో పోలీసులు రాజీ కుదిర్చే ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

శ్రీకాళహస్తి
సత్యవేడు

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ



రాహుకేతు మండపం వద్ద భక్తులు

శ్రీకాళహస్తి, జూన్ 2: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వేసవి, వారాంతపు సెలవులు కావడంతో తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సుమారు 30వేల మంది భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.200 శీఘ్ర దర్శన టిక్కెట్ల ద్వారా 1,610మంది, రూ.50 టిక్కెట్ల ద్వారా 2,830మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 టిక్కెట్ల ద్వారా 2,962మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,089, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 272మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 251మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 66మంది భక్తులు పూజలు రాహుకేతు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 17,319 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

అంకాళపరమేశ్వరి అగ్నిగుండ ప్రవేశం



పురవీధుల్లో ఊరేగడానికి ముస్తాబైన అమ్మవారు

పిచ్చాటూరు, జూన్ 2: మండలంలోని తులసికృష్ణాపురం పంచాయతీ అద్దాలమేడ గ్రామంలో ఆదివారం సాయంత్రం అంకాళపరమేశ్వరి ఆలయ ఆవరణలో అగ్నిగుండ ప్రవేశం జరిగింది. గత ఐదు రోజులుగా గ్రామంలో జరుగుతున్న తిరుణాళ్లలో భాగంగా చివరి రోజు ఆదివారం కంకణదారు దారులైన భక్తులు గోవిందనామస్మరణ చేస్తూ అగ్నిగుండ ప్రవేశం చేశారు. అనంతరం విశేషాలంకరణతో ముస్తాబైన అమ్మవారిని మంగళవాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు ధూపదీప నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ, అమ్మవారి భారీ కటౌట్లు చూపరులను ఆకర్షించాయి.

ముక్కంటి సేవలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి



ఆలయ ధ్వజస్తంభం వద్ద జస్టిస్ శేషసాయి కుటుంబ సభ్యులు

శ్రీకాళహస్తి, జూన్ 2: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆదివారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక న్యాయమూర్తులు శ్రీనివాస్‌నాయక్, కృష్ణప్రియ, ఆలయ అధికారులు సతీష్‌మాలిక్, నాగభూషణం నాయక్, నాగభూషణం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన సుధీర్‌రెడ్డి



చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, జూన్ 2: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును శ్రీకాళహస్తి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి ఆదివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను శాలువతో సన్మానించి ముక్కంటి ప్రసాదాలను అందజేశారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పోలింగ్ సరళిని చంద్రబాబుకు వివరించారు.

అనుమతి లేకుండా బోరు వేయడంపై ఫిర్యాదు

రేణిగుంట, జూన్ 2: రేణిగుంట పట్టణం శ్రీకాళహస్తి రోడ్డులోని ఓ ప్రైవేటు స్థలంలో ఆదివారం ప్రభుత్వ అనుమతి లేకుండా బోరు వేస్తుండటంతో వార్డు మెంబర్లు ఎంజీ రెడ్డి, విజయలక్ష్మి పంచాయతీ కార్యదర్శి, ఈవో పీఆర్డీకి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. సర్పంచు నాగేశం, సిబ్బంది అక్కడికి చేరుకుని బోరు ఆపేయాలని చెప్పినా పట్టించుకోకుండా పనులను కొనసాగించారు. దీంతో పంచాయతీ సిబ్బంది రేణిగుంట అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పుత్తూరు వార్తలు

డాక్టర్ రవిరాజుకు సన్మానం



డాక్టర్ రవిరాజును సన్మానిస్తున్న అశోక్‌రాజు, వైద్యులు

పుత్తూరు, జూన్ 2: జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవిరాజును ఘనంగా సన్మానించారు. ఆదివారం పుత్తూరు బైపాస్‌లోని ఓ కల్యాణ మండపంలో రవిరాజు పదవీ విరమణ సన్మానం జరిగింది. సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల యజమాని అశోక్‌రాజు, జిల్లా వైద్యాధికారి శ్రీహరి, తిరుపతి, పుత్తూరుకు చెందిన డాక్టర్లు శ్రీనివాసులు రెడ్డి, సుభాషిణి, శ్రీనివాసులు, చంద్రశేఖర వర్మ, జయలక్ష్మి, ఆశ్రిత, నవ్యత, నాయకులు చక్రపాణిరెడ్డి, నూకతోటి రాజేష్, ఏలుమలై, భాస్కర్‌రాజు, రవిశేఖర్‌రాజు, భాస్కరరెడ్డి, పద్మనాభరాజు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక



సమావేశమైన పూర్వ విద్యార్థులు

వడమాలపేట, జూన్ 2: వడమాలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2006-07లో పదవ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. ఎక్కడెక్కడో ఉద్యోగాలు, వివిధ వృత్తుల్లో స్థిరపడిన వీరంతా తాము చదువుకున్న రోజులను గుర్తుచేసుకుని గత స్మృతులను మెరువేసుకున్నారు. చదువులు నేర్పిన ఉపాధ్యాయులులను సన్మానించారు. పాఠశాలలో సరస్వతీదేవి విగ్రహం నెలకొల్పి మందిరాన్ని నిర్మించాలని తీర్మానించారు.

గంజాయి మత్తులో కత్తితో దాడి

రేణిగుంట, జూన్ 2: రేణిగుంట పట్టణంలో గంజాయి మత్తులో ఉన్న వ్యక్తిపై కత్తితో దాడి చేసిన ఘటన ఆదివారం సాయంత్రం రైల్వేస్టేషన్ సమీపంలోని ఆటోస్టాండ్ వద్ద చోటు చేసుకుంది. పోలీసులు కథనం మేరకు... రమేష్ స్థానిక హోటల్‌లో వంట పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం గంజాయి, మద్యం సేవించి ఆటోస్టాండ్ సమీపంలో నిద్రించాడు. అదే సమయంలో రామయ్య అనే వ్యక్తి మద్యం తాగి నిద్రిస్తుండగా కాలు తగలడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో రామయ్యపై రమేష్ కత్తితో దాడి చేయడంతో రక్త గాయాలయ్యాయి. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని తిరుపతిలోని రుయా ఆస్పత్రికి తరలించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

పిడుగుపాటుకు వాటర్‌ట్యాంక్ ధ్వంసం

కేవీబీపురం, జూన్ 2: మండలంలోని కళత్తూరు గ్రామంలో శనివారం అర్ధరాత్రి ఉరుములు, మెరుపులతో పాటు వర్షం కురిసింది. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన తిరుపతి పార్లమెంటు తెలుగు రైతు అధ్యక్షుడు గోపీనాథ్‌రెడ్డి ఇంటిపై పిడుగు పడింది. దీంతో ఇంటిపై ఉన్న వాటర్‌ట్యాంక్ ధ్వంసమైంది. ఇంట్లోని ఫ్రిజ్, ఏసీ, విద్యుత్ పరికరాలు కాలిపోయాయి.

టీడీపీ నాయకుడికి పరామర్శ



జగదీష్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న బృందమ్మ

శ్రీకాళహస్తి, జూన్ 2: శ్రీకాళహస్తి మండలం కాపుగున్నేరి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు జగదీష్‌రెడ్డి తల్లి సంగటి బత్తెమ్మ ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సతీమణి బొజ్జల బృందమ్మ అక్కడికి చేరుకుని బత్తెమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జగదీష్‌రెడ్డిని ఓదార్చారు. కార్యక్రమంలో బొజ్జల రిషితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో ఊరట

వరదయ్యపాళెం, జూన్ 2: మండలంలో శనివారం రాత్రి కురిసిన వర్షం మండుటెండల తీవ్రతతో అల్లాడిన ప్రజలకు ఊరట కలిగింది. గత కొన్ని రోజులుగా ఎండ వేడిమికి తాళలేక ప్రజలు ఉక్కపోతతో అవస్థలు పడ్డారు. శనివారం రాత్రి వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడడంతో రాత్రి 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు.

గ్రామ దేవతలకు పొంగళ్లు



అంబళ్లు పోస్తున్న గ్రామస్తులు

వరదయ్యపాళెం, జూన్ 2: వరదయ్యపాళెం మండలం నాగనందాపురం గ్రామంలో వెలసిన పోలేరమ్మ, సిద్ధులయ్య, వేపచెట్టుకు మహిళలు పెద్దఎత్తున ఆదివారం పొంగళ్లు పెట్టారు. వేపచెట్టుకు పూలమాల వేసి అంబళ్లు పోశారు. కార్యక్రమంలో పూజారి మునిరత్నం, గ్రామపెద్దలు రమేష్‌రెడ్డి, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతకు అభినందన



మునిరాజా యాదవ్‌కు సైకిల్ ప్రతిమ అందజేస్తున్న సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, జూన్ 2: శ్రీకాళహస్తి నియోజకవర్గ టీడీపీ బీసీ సెల్ కార్యదర్శి మునిరాజా యాదవ్‌ను ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి అభినందించారు. వైసీపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానలను సోషల్ మీడియా విభాగం ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లడానికి మునిరాజా యాదవ్ చేసిన కృషిని మన టీడీపీ వేదిక ద్వారా చంద్రబాబునాయుడు ప్రశంసించారు. ఆదివారం సాయంత్రం సుధీర్‌రెడ్డి సైకిల్ ప్రతిమను అందజేసి మునిరాజా యాదవ్‌ను అభినందించారు. ఈ సందర్భంగా మునిరాజా యాదవ్ మాట్లాడుతూ టీడీపీలో కష్టపడి పనిచేసేవాడికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. చంద్రబాబునాయుడు నాయకత్వంలో మన టీడీపీ వేదిక ద్వారా ప్రశంసలు అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

రేపు సాయంత్రానికి
పూర్తి ఎన్నికల ఫలితాలు వెల్లడిస్తాం
● కౌంటింగ్‌కు సర్వం సిద్ధం: కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 2: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ మంగళవారం సజావుగా జరగడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టామని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. విజయవాడ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా జిల్లా అధికారులతో కౌంటింగ్ ప్రక్రియపై ఆదివారం వర్చువల్ విధానంలో సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్సుకు కలెక్టరేట్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్, డీఆర్వో పెంచలకిషోర్ హాజరయ్యారు. జిల్లా అధికారులను ఉద్దేశించి సీఈవో మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఎలాంటి అంతరాయం లేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలన్నారు. పలు అంశాలపై జిల్లా అధికారులకు దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ వివరిస్తూ.. పోస్టల్ బ్యాలెట్, ఈవీఎం ఓట్ల లెక్కింపు ప్రక్రియ సాయంత్రం 4గంటలకు పూర్తి చేసి ఫలితాలు వెల్లడిస్తామని, అందుకు తగిన చర్యలు చేపట్టామన్నారు. పూర్తి భద్రత నడుమ కౌంటింగ్ ప్రక్రియ నిర్వహిస్తామని సీఈవోకు తెలిపారు.

మందుబాబుల అడ్డాగా మినీస్టేడియం

● రెచ్చిపోతున్న ఆకతాయిలు
● పట్టించుకోని అధికారులు



మైదానంలో సీసాపెంకుల మధ్య ఆడుతున్న క్రీడాకారులు, ఇన్‌సెట్లో పగిలిన సీసా పెంకులు

శ్రీకాళహస్తి, జూన్ 2: శ్రీకాళహస్తి పట్టణంలోని మినీస్టేడియం మందుబాబులకు అడ్డాగా మారిపోయింది. చీకటి పడితే ఆకతాయిలు చెలరేగిపోతున్నారు. గుంపులుగుంపులుగా తిష్టవేసి మద్యం సేవించడమే కాకుండా అక్కడే సీసాలను ఛిద్రం చేస్తున్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని పిచ్చాటూరు రహదారికి ఆనుకుని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ఉంది. ఈ కళాశాల మైదానంలో గత టీడీపీ ప్రభుత్వం మినీ స్టేడియం ఏర్పాటు చేసింది. క్రీడాకారులకు వీలుగా ఈ స్టేడియంను తీర్చిదిద్దేందుకు టీడీపీ ప్రభుత్వం కృషి చేసింది. గత ఐదేళ్ల నుంచి మినీస్టేడియం బాగోగులను పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. రాత్రి అయితే క్రీడామైదానం అసాంఘిక శక్తులకు అడ్డాగా మారిపోతోంది. ఆకతాయిలు ఇక్కడ మద్యం, గంజాయి వంటి మత్తుపదార్థాలను సేవిస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. రాత్రి వేళల్లో ఇక్కడ మద్యం సేవించి ఘర్షణలకు పాల్పడిన ఘటనలు చాలా వెలుగు చూశాయి. ఆరు నెలల వ్యవధిలో పలుమార్లు ఇక్కడ మందుబాబులు దాడులకు పాల్పడన ఘటనలు ఉన్నాయి. ఈ యేడాదిలో ఇక్కడ జరిగిన రెండు దాడి ఘటనలపై టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదు కావడం గమనార్హం. ఉదయం, సాయంత్రం వేళలో పిల్లలు, పెద్దలు అధిక సంఖ్యలో ఇక్కడికి చేరి వ్యాయామం చేస్తూ సేద తీరుతుంటారు. ముఖ్యంగా వాకింగ్‌కు ఎక్కువగా విచ్చేస్తుంటారు. ఇక పెద్దసంఖ్యలో యువత క్రికెట్ ఆడుతుంటారు. ఇదే మైదానంలో విలువిద్య శిక్షణ కూడా అందిస్తారు. ఇందుకోసం చిన్నపిల్లలు ఉదయం, సాయంత్రం వేళల్లో మైదానంలో వ్యాయామం చేయాల్సి ఉంటుంది. రాత్రంతా మందుబాబులు సీసాలతో విధ్వంసం చేస్తున్నారు. ఉదయం పిల్లలు, పెద్దలు వాటి మధ్యే ప్రమాదకరంగా సంచరించాల్సి వస్తుండడంతో తరచూ వారు గాయపడుతున్నారు. మందుబాబులను కట్టడి చేయాలని స్థానికులు మొరపెట్టుకుంటున్నా అధికారులెవరూ అటువైపు కన్నెత్తి చూడటంలేదు. పూర్తిగా ఆకతాయిల కోసమే మినీస్టేడియం కేటాయించినట్లుగా పరిస్థితి కొనసాగుతోంది. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

పోలీస్ అబ్జర్వర్ దీపక్ మిశ్రాకు స్వాగతం



దీపక్ మిశ్రాకు స్వాగతం పలుకుతున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

రేణిగుంట, జూన్ 2: ఎన్నికల కౌటింగ్‌కు ఈసీ ప్రత్యేకంగా నియమించిన స్పెషల్ పోలీస్ అబ్జర్వర్ దీపక్ మిశ్రాకు ఆదివారం హైదరాబాద్ విమానంలో రేణిగుంట విమానాశ్రయం చేరుకున్నారు. ఆయనకు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఏఎస్పీ కులశేఖర్, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

క్రీడాశక్తిని పెంపొందించేందుకు చదరంగం పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

శ్రీకాళహస్తి, జూన్ 2: విద్యార్థుల్లో క్రీడాశక్తిని పెంపొందించేందుకే చదరంగంపై శిక్షణ, పోటీలు నిర్వహిస్తున్నట్లు ది చిల్డ్రన్ చెస్ సంస్థ నిర్వాహకులు తెలిపారు. పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చదరంగంపై అవగాహన కల్పించి పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి యూత్ ఎంప్లాయిస్ సోషల్ సర్వీస్ సంస్థ చేత బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో శ్యాంబాబు, బాలసుబ్రహ్మణ్యం, సురేష్ బాబు, యంగ్ ఎంప్లాయిస్ సోషల్ సర్వీస్ అధ్యక్షుడు హేమకుమార్, నారాయణ, శ్రీనివాసులు, సురేష్‌బాబు, ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో 20 ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం

శ్రీకాళహస్తి, జూన్ 2: శ్రీకాళహస్తి, కేవీబీపురం, ఏర్పేడు, తొట్టంబేడు మండలాల్లో శనివారం రాత్రి కురిసిన వర్షానికి 20 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నట్లు విద్యుత్‌శాఖ తిరుపతి రూరల్ ఈఈ వాసురెడ్డి తెలిపారు. వెంటనే ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులను చేపట్టామని, అలాగే నేలకొరిగిన విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించి సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఈఈ వివరించారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

శ్రీకాళహస్తి, జూన్ 2: తొట్టంబేడు మండలంలో శనివారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన గాలివాన రావడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఆదివారం ఉదయం విద్యుత్‌శాఖ అధికారులు మరమ్మతులు చేసి సరఫరా పునరుద్ధరించారు. రైతులకు, గ్రామాల్లో తాగునీటికి ఎలాంటి ఇబ్బంది లేకుండా సమస్య పర్కిరించినట్లు ఏడీ సతీష్‌శెట్టి, లైన్‌మాన్ నాగరాజు తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



అధ్యాపకులతో పూర్వ విద్యార్థులు

శ్రీకాళహస్తి, జూన్ 2: పట్టణంలోని స్కిట్ కళాశాలలో 2008-2012 విద్యా సంవత్సరంలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్ విద్యను అభ్యసించిన విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఆదివారం జరిగింది. ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకుని తాము చదువుకున్న రోజుల్లో జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్య నేర్పిన గురువులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మురళి, సాజిద్, చేతన్, చంటి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

వరదయ్యపాళెం, జూన్ 2: శాంతిభద్రతకలు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ ప్రతాప్ స్పష్టం చేశారు. మంగళవారం జరనున్న ఓట్ల లెక్కింపు సందర్భంగా వరదయ్యపాళెంలో భద్రతా చర్యలు చేపట్టారు. 144సెక్షన్ అమల్లో ఉందని, ఓట్ల లెక్కింపు సందర్భంగా అందరూ శాంతి భద్రతలకు సహకరించాలన్నారు. ఏఎస్ఐ షణ్ముగం, సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు వ్యక్తుల దుర్మరణం
స్కూటర్‌ని ఢీకొన్న గుర్తు తెలియని వాహనం

చంద్రగిరి, జూన్ 2: చంద్రగిరి మండలం, కోదండరామాపురం వద్ద పూతలపట్టు, నాయుడుపేట జాతీయ రహదారిలో ఆదివారం రాత్రి స్కూటర్‌ని గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో ఇద్దరు అక్కడిక్కడే మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు తిరుపతి రూరల్ మండలం పేరూరు పంచాయతీ ఎస్టీ ఆర్ కాలనీకి చెందిన అమ్ములు(38), ఎస్వీ నగర్‌కు చెందిన విశ్వం(28) తిరుపతి వ్యవసాయ కళాశాలలోని మెస్‌లో కార్మికులుగా పనిచేస్తున్నారు. సొంత పనుల నిమిత్తం చిత్తూరుకు స్కూటర్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో కోదండరామాపురం వద్దకు రాగానే గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో అమ్ములు, విశ్వం తీవ్ర గాయాలతో అక్కడిక్కడే మృతి చెందారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతదేహాలను పరిశీలిస్తున్న పోలీసులు

పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్‌పై టీడీపీ ఏజెంట్లకు శిక్షణ



శిక్షణ శిబిరానికి హాజరైన కౌంటింగ్ ఏజెంట్లు

రేణిగుంట, జూన్ 2: తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్శిటీలో మంగళవారం జరిగే పోస్టల్‌బ్యాలెట్ కౌంటింగ్‌పై టీడీపీ ఏజెంట్లకు ఆదివారం రేణిగుంటలోని వై కన్వెన్షన్ హాల్‌లో శిక్షణ శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహయాదవ్, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ పోస్టల్‌బ్యాలెట్ కౌంటింగ్‌లో పాల్గొనే ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటు వేసిన బ్యాలెట్ పత్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించి ఏదైనా తప్పులు ఉంటే అక్కడే ఉన్న ఆర్వోకు తెలియపరచాలన్నారు. ఓట్లు లెక్కింపు సమయంలో వైసీపీ ఏజెంట్లు కుయుక్తులు పన్ని, టీడీపీ వారిని బయటకు పంపే ప్రయత్నం చేసినా అక్కడే ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీధర్‌వర్మ, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, పులివర్తి సుధారెడ్డి, యశ్వంత్‌రెడ్డి, ఆచారి తదితరులు పాల్గొన్నారు.

గుట్టను చదునుచేసి ఇంటి నిర్మాణం



గుట్టను చదును చేసి ఇంటిని నిర్మిస్తున్న దృశ్యం

రేణిగుంట, జూన్ 2: రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీలో ఏకంగా గుట్టను చదునుచేసి అక్రమంగా ఇల్లు నిర్మిస్తున్నారు. కరకంబాడి పంచాయతీ కార్యాలయం వెనుకవైపు ఉన్న గుట్టను ఇటీవల ఎక్స్‌కవేటర్లతో చదును చేసి ఇంటి నిరారిణం చేపట్టారు. ఈ విషయంపై స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో నిర్మాణాన్ని ఆపేశారు. అయితే మళ్లీ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఈ విషయంపై కరకంబాడి వీఆర్వో కృష్ణ పిళ్లైను వివరణ కోరగా గతంలోనే ఇంటి నిర్మాణాన్ని అడ్డుకున్నామని, మళ్లీ పనులు కొనసాగిస్తుంటే ఎక్స్‌కవేటర్లతో తొలగిస్తామని తెలిపారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 2: మండల కేంద్రంలోని పూజిత జూనియర్ కళాశాల ఆవరణలో డైనమిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శంకర నేత్రాలయ ఆస్పత్రి మిషన్ ఫర్ విజన్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. 76 మందికి డాక్టర్ అరవింద్ వైద్య పరీక్షలు నిర్వహించారు. 24 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేసి అద్దాలు అందజేస్తామని పీఆర్వో వెంకటముని తెలిపారు. ఈ కార్యక్రమంలో యోగా గురువు సురేష్‌నాయుడు, డైనమిక్ ఫౌండేషన్ ప్రతినిధులు నాగప్రసాద్, బాలకృష్ణ, శ్రీనివాస్, తేజ, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.